Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 89 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 8 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ప్రధాని శ్రీశైలం పర్యటన ఖరారు.. ఎప్పుడంటే



**నంద్యాల, (రాజధాని వార్తలు):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న శ్రీశైలం క్షేత్ర పర్యటన ఖరారైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. శ్రీశైలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించే ప్రదేశాలైన ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. ఈరోజు (మంగళవారం) శివాజీ రాజదర్బార్, శివాజీ ధ్యానమందిరం ఏర్పాట్లను ఎంపీ బైరెడ్డి, శబరి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పరిశీలించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ.. సరళీకృత జీఎస్టీ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమానికి ఈనెల 16న కర్నూలులో ప్రధాని మోదీ పాల్గొంటారని తెలిపారు. ప్రధాన మంత్రి మోదీ మొదటి సారిగా శ్రీశైలం రావడం శుభపరిణామమని అన్నారు. ప్రధాని శ్రీశైలం పర్యటనతో క్షేత్ర వైభవం మరింత పెరుగుతుందన్నారు. శ్రీశైలం ప్రాంతం యొక్క విశిష్టత టూరిజం అభివృద్ధి ఈ ప్రాంతం యొక్క విశేషాలు ప్రపంచానికి తెలిసే అవకాశం ఉందని చెప్పారు. శ్రీశైలం మల్లన్న దర్శనం అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రానికి ప్రధాన మంత్రి మోదీ చేరుకుంటారని మాధవ్ పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక.. టీడీపీ నేతలతో చంద్రబాబు చర్చ



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తెలంగాణ టీడీపీ నేతలతో ఆ పార్టీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు (మంగళవారం) సాయంత్రం 7 గంటలకు సమావేశం కానున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పట్ల అనుసరించాల్సిన విధానంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కూటమి అభ్యర్థి విజయానికి నేతలు కృషి చేయాలని వారికి దిశానిర్దేశం చేయనున్నారు ముఖ్యమంత్రి. నారావారిపల్లె నుంచి చంద్రబాబు వచ్చిన వెంటనే తెలంగాణ నేతలతో ఉండవల్లి నివాసంలో సమావేశం కానున్నారు. కాగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు తమ్ముడు నారా రామూర్తి నాయుడు మరణించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో నారావారిపల్లెలో సంవత్సరీకం, స్మృతి వనం ఏర్పాటు చేశారు. ఈరోజు ఉదయం నారావారిపల్లె సమీపంలోని రంగపేట హెలిప్యాడ్‌కు చేరుకున్న సీఎం.. అక్కడి నుంచి నారావారిపల్లెలోని ఇంటికి చేరుకున్నారు. నారా రామూర్తినాయుడు సంవత్సరీకం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఆపై మధ్యాహ్నం రంగంపేట వద్ద ఉన్న హెలిప్యాడ్ నుంచి తిరుగు ప్రయాణం అయి..ఉండవల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నారావారిపల్లెలో పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## జగన్‌కు హెలికాప్టర్ ఓకే.. రోడ్ షోకు నో పర్మిషన్

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం నుంచి మాకవరపాలెం వరకూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోడ్ షోకు అనుమతి ఇవ్వలేమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా ప్రకటించారు. మాకవరపాలెంలో నిర్మితమవుతున్న మెడికల్ కాలేజీ పనులను పరిశీలించడానికి ఈ నెల 9వ తేదీన జగన్ రానున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు (మంగళవారం) అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ మీడియా సమా వేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ విశాఖ నుంచి మాకవరపాలెం వరకు 63 కిలో మీటర్ల జాతీయ రహదారిపై కాన్వాయ్‌తో రావడానికి వైసీపీ శ్రేణులు అనుమతులు కోరినట్లు తెలిపారు. విశాఖ నుంచి మాకవరపాలెం వరకు హెలికాప్టర్‌పై మాజీ సీఎం జగన్ వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. జాతీయ రహదారి రోడ్డు మార్గంలో కూడళ్ల వద్ద జన సమీకరణ చేసే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రజలకు అసౌక ర్యం కలగకుండా రోడ్డు మార్గంలో మాజీ సీఎం జగన్ పర్యటించేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. మాకవరపాలెం మెడికల్ కళాశాల వద్ద హెలిపాడ్



ఏర్పాటు చేసి జగన్ మోహన్ రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చేలా అనుమతి ఇచ్చామన్నారు. తమిళనాడులో ఇటీవల విజయ్ నిర్వహించిన రోడ్ షోలో 41 మంది ప్రాణాలు కోల్పోగా, వంద మందికి పైగా గాయపడ్డారని గుర్తు చేశారు. ఇలాంటి దురదృష్టకరమైన సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందులో భాగంగానే మాజీ సీఎం జగన్ 63 కిలోమీటర్ల మేర కాన్వాయ్‌తో ప్రయాణించేందుకు అనుమతిని నిరాకరించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు.

## సవీందర్‌రెడ్డిపై సీబీఐ చర్యలు తీసుకోవద్దు.. సుప్రీం కీలక ఆదేశాలు

**ఢిల్లీ :** సోషల్ మీడియా యాక్టివిస్టు సవీందర్‌రెడ్డిని అరెస్టు చేసిన వ్యవహారంలో.. సీబీఐ తదుపరి కార్యాచరణ చేపట్టవద్దని సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సవీందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడంపై దాఖలైన హెబీయస్ కార్పస్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు ఇవాళ(మంగళవారం) విచారణ జరిపింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వులను సుప్రీం కోర్టులో వ్యక్తిగత హోదాలో సవాలు చేశారు దర్యాప్తు అధికారి గన్నవరపు శ్రీనివాసరావు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీష్ చంద్రశర్మ విచారణ చేపట్టారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టినందుకు అక్రమంగా అరెస్టు చేశారని హైకోర్టులో సవీం దర్‌రెడ్డి భార్య లక్ష్మీప్రసన్న పిటిషన్ దాఖలు చేశారు. సవీందర్‌రెడ్డిని గంజాయి కేసులో అరెస్టు చేశారని సుప్రీం కోర్టుకి ఏపీ ప్రభుత్వ దర్యాప్తు అధికారి తరపు న్యాయవాదులు నివేదించారు. ఒక రాజకీయ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని అరెస్టు చేసి... తర్వాత గంజాయి కేసులో ఇరికించారని సవీందర్‌రెడ్డి తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. అదే విషయాన్ని హైకోర్టు పరిశీలించిన తర్వాతే సీబీఐ విచారణకు ఆదేశించిందని న్యాయవాది పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని సవీందర్‌రెడ్డి న్యాయవాది వివరించారు. గంజాయి కేసులో అరెస్టు చేస్తే... దానికి రాజకీయ




కారణాలు అన్వయిస్తున్నారని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయ వాది సిద్ధార్థ్ లూథ్రా న్యాయస్థానానికి తెలిపారు. ఇరువురి వాదనలను జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. అనంతరం ఈ కేసుపై మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేయడంతోపాటు సీబీఐ తదుపరి కార్యచరణ చేపట్టవద్దని ఆదేశించింది ధర్మాసనం. ప్రతివాదులుగా ఏపీ ప్రభుత్వం, డీజీపీ, సీబీఐ, రిలయన్స్ జియో సంస్థతో పాటు...మొత్తం 11 మందిని ఈ కేసులో దర్యాప్తు అధికారి చేర్చారు. ఈ కేసులో పిటిషన్ దాఖలు చేసేందుకు ఏపీ ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది ధర్మాసనం. ఈ పిటిషన్‌పై త్వరలోనే తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

## డీబీటీ నగదు బదిలీ ద్వారా ప్రభుత్వానికి రూ. 4.31 లక్షల కోట్లు ఆదా : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**ముంబై :** వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు మొత్తాల్ని ఆయా లబ్దిదారులకు నేరుగా వాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తున్న విషయం విదితమే. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి అక్షరాలా నాలుగు లక్షల 31 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని మీకు తెలుసా. ఇది నిజం. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ముంబైలో జరుగుతున్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమం పాల్గొన్న కేంద్రమంత్రి ఈరోజు విదేశీ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను కూడా ప్రారంభించారు. ఈ ఆధునిక వ్యవస్థ విదేశీ కరెన్సీ లావాదేవీలను రియల్-టైమ్ (తక్షణమే) ప్రాతిపదికన పూర్తి చేస్తుందని ఆమె చెప్పారు. ప్రస్తుతం, ముంబైలో విదేశీ కరెన్సీని సెటిల్ చేయడానికి 36 నుండి 54 గంటలు పడుతుందని.. ఇవాళ ప్రారంభించిన గిఫ్ట్ సెటిల్‌మెంట్ వ్యవస్థతో ఈ సమయం చాలా ఆదా అవుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఫలితంగా భారత్ ఇప్పుడు, హాంకాంగ్, టోక్యో, మనీలా సరసన చేరిందని మంత్రి తెలిపారు. దేశంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫిన్‌టెక్, ఆధార్, యుపిఐ, డిజిలాకర్ వ్యవస్థల్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ఎలా ముందుకెళ్తున్నామన్న విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని అన్ని వ్యవస్థలు టెక్నాలజీ వారధిగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. గోప్యతను కాపాడుతూ, ప్రతి పౌరుడిని ఉద్ధరించేలా, టెక్నాలజీ దినదినాభివృద్ధి చెందాలని ఆమె సూచించారు. తద్వారా దేశం మరింత త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని నిర్మలా సీతారామన్ అన్నారు.

## పేద విద్యార్థికి వైద్య విద్య.. ఇదే కూటమి సర్కార్ లక్ష్యం : మంత్రి సత్యకుమార్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గత ప్రభుత్వం అసమర్ధ పాలన వలన మెడికల్ కళాశాలలకు ఈ దుస్థితి వచ్చిందని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్వతీపురం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తే గత ఐదేళ్లలో కనీసం భూసేకరణ కూడా చేయలేదని.. హాస్పిటల్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలవలేదని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మెడికల్ కళాశాలల నిర్మాణం కోసం పట్టించుకోలేని వైసీపీ నాయకులు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. పాడేరులో మెడికల్ కళాశాలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా చేయకపోతే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గిరిజన ప్రాంతాలను విస్మరించిందని.. గిరిజన విశ్వవిద్యాలయం రాకుండా అడ్డుకున్నాని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం పాపాలు తమకు శాపాలుగా మారాయని వ్యాఖ్యలు చేశారు. పీపీపీకి ప్రైవేటైజేషన్‌కు తేడా తెలియకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని మంత్రి దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో వైద్య కళాశాలలో నిర్మించి ఉంటే ఇప్పుడు ఈ సమస్య ఉండేది కాదన్నారు. వైద్య విద్యను రాష్ట్రంలో పేద విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని స్పష్టం చేశారు. గతంలో తాము చేయలేని పనిని కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తుందని వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారుని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అనారోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చితే.. తాము ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా నిర్మాణం చేస్తున్నామని వెల్లడించారు. పాఠశాలలలో కనీసం నిర్వ




హణ పనులు గత ప్రభుత్వం చేయలేదన్నారు. 'జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం మెడికల్ కళాశాలల పరిశీలనకు వస్తే అదే సమయంలో నేను వస్తాను. మెడికల్ కళాశాలల పరిస్థితిని జగన్ మోహన్ రెడ్డికి వివరిస్తాను. జగన్ ప్యాలెస్ పూర్తిస్థాయిలో నిర్మాణం చేసే వరకు లోపలికి వెళ్లారా. నర్సీపట్నం మెడికల్ కళాశాల పరిశీలనకు వస్తున్న జగన్ పార్వతీపురంలో నిర్మించిన మెడికల్ కళాశాల చూసి అక్కడ పరిస్థితిని వివరించాలి. జగన్ ప్రజలను అసత్యాలు చెప్పి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు జగన్ కు గుణపాఠం చెప్పిన మార్పు రావడం లేదు. జగన్ ఆత్మ పరిశీలన చేసుకొని బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకునిలా వ్యవహరించాలి. జగన్‌కు అసెంబ్లీకి రమ్మని సవాల్ విసిరినా రాలేదు' అంటూ మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేశారు.

## బిగ్ బ్రదర్ ఎవరూ లేరు... ఆ రెండు పార్టీలకు చెరి సగం




**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో ఎన్డీయేలో సీట్ల షేరింగ్ ఫార్ములాపై ఆసక్తి నెలకొంది. కీలక భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, బీజేపీలు ఎక్కువ తక్కువల ప్రసక్తి లేకుండా సమంగా సీట్లు పంచుకుని సమష్టిగా పోటీకి దిగుతాయని ఆయా పార్టీ వర్గాల సమాచారం. ప్రస్తుతం సీట్ల షేరింగ్‌కు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, ఎన్ని సీట్లలో పోటీ చేస్తారనే దానిపై త్వరలోనే తుది నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు. మొత్తం 243 సీట్లకు గాను 205 సీట్లను బీజేపీ-జేడీయూ సమంగా పంచుకుంటాయని, తక్కిన 38 సీట్లు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన లోక్ జన్‌శక్తి పార్టీ, హిందుస్థానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ సమత పార్టీకు కేటాయించనున్నాయని తెలుస్తోంది. చిరాగ్ పాశ్వాన్ ఎల్‌జేపీకి 25 సీట్లు, హెచ్ఏఎం నేత జితిన్ రామ్ మాంఝీకి 7 సీట్లు, ఉపేంద్ర కుష్వాహ ఆర్ఎల్ఎంకు 6 సీట్లు బీజేపీ ఆఫర్ చేసినట్టు చెబుతున్నారు. తమ పార్టీ నేతలకు నిర్దిష్ట నియోజకవర్గాలు కేటాయించాలని చిరాగ్ పాశ్వాన్ కోరు తుండటంతో చర్చలు కొనసాగుతున్నాయి. మరిన్ని సీట్లకు కూడా ఆయన పట్టుబడుతున్నారు. ఎల్‌జేపీకి మరిన్ని సీట్లు కేటాయిస్తే మాంఝీ, కుష్వాహలకు తక్కువ కేటాయింపులు జరుగుతాయి. చిన్న భాగస్వామ్య పార్టీలకు సీట్లు తగ్గితే వారికి రాజ్యసభ, లెజిస్లేటివ్ కౌన్సిల్ సీట్లు ఇస్తామని బీజేపీ ఆఫర్ చేసే అవకాశముందని చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ ప్రక్రియను ప్రకటించింది. నవంబర్ 14న ఫలితాలు వెల్లడవుతాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబర్ 22తో ముగియనుండటంతో ఈలోపు ఎన్నికలు పూర్తిచేయడం ద్వారా సజావుగా అధికార మార్పిడి జరిగేందుకు ఈసీ పట్టుదలగా ఉంది. బిహార్ తొలి విడత పోలింగ్ గ్రామీణ, వరద ప్రభావిత ప్రాంతాలతో సహా సెంట్రల్ బిహార్‌లోని 121 నియోజకవర్గాల్లో జరుగనుండగా, రెండో విడతలో 122 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. ఈ విడతలో ప్రధానంగా సరిహద్దు ప్రాంతాలు ఉన్నాయి. నితీష్ కుమార్ సారథ్యంలోని ఎన్డీయే, ఆర్జేడీ సారథ్యంలోని 'ఇండియా' కూటమి మధ్య ప్రధాన పోటీ ఉండే అవకాశాలుండగా, ప్రశాంత్ కిషోర్ 'జన్ సురాజ్' సైతం ఎన్నికల బరిలో ఉంది. తొలిసారి ఆమ్ ఆద్మీ పార్టీ సైతం బిహార్‌లోని 243 నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధమవుతోంది.

# వి.ఎస్.యూ విద్యార్థి పృథ్వీరాజ్‌కు రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఎన్ఎస్ఎస్ ఉత్తమ వాలంటీర్ అవార్డు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వి.ఎస్.యూ), నెల్లూరు బయోటెక్నాలజీ విభాగానికి చెందిన యన్ ఎస్ ఎస్ వాలంటీర్ ఎం.పృథ్వీరాజ్ సామాజిక సేవలో చేసిన విశిష్ట కృషికి గాను యన్ ఎస్ ఎస్ జాతీయ ఉత్తమ వాలంటీర్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును ఇవాళ న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయనకు ప్రదానం చేశారు. ఈ వేడుకలో కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా శాఖ ఉన్నతాధికారులు, వివిధ రాష్ట్రాల యన్ ఎస్ ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. వి.ఎస్.యూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, "మా విశ్వవిద్యాలయానికి ఇది గర్వకారణం. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవలో అంకితభావాన్ని చూపడం విశేషం. పృథ్వీరాజ్ సాధించిన ఈ జాతీయ అవార్డు ఇతర యువతకు ప్రేరణగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. వి.ఎస్.యూ రిజిస్ట్రార్ డా. కే.సునీత మాట్లాడుతూ, "పృథ్వీరాజ్ సాధించిన ఈ జాతీయ స్థాయి గౌరవం వి.ఎస్.యూ ప్రతిష్ఠను పెంచింది. విద్యార్థులు విద్యా ప్రగతితో పాటు సామాజిక బాధ్యతల పట్ల చూపుతున్న నిబద్ధత విశ్వవిద్యాలయానికి గర్వకారణం. పృథ్వీరాజ్ వంటి యువతే సమాజానికి ఆదర్శం" అని అభినందించారు. కాలేజ్ ప్రిన్సిపాల్ డా.సిహెచ్. విజయ మాట్లాడుతూ, "మా కళాశాల విద్యార్థి పృథ్వీరాజ్ జాతీయ స్థాయిలో యన్ ఎస్ ఎస్ ఉత్తమ వాలంటీర్ అవార్డును అందుకోవడం గర్వకారణం. ఈ విజయంతో మా కళాశాల ప్రతిష్ఠ మరింత పెరిగింది. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవలోనూ అగ్రగాములు కావాలని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాము" అని తెలిపారు. యన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. ఉదయ శంకర్ అల్లం మాట్లాడుతూ, "పృథ్వీరాజ్ పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అవగాహన కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన కృషి యన్ ఎస్ ఎస్ యూనిట్ల ప్రతిష్ఠను జాతీయ స్థాయికి తీసుకెళ్లింది" అని ప్రశంసించారు. జాతీయ అవార్డును స్వీకరించిన అనంతరం శ్రీ ఎం. పృథ్వీరాజ్ మాట్లాడుతూ, "ఈ అవార్డు నాకు మాత్రమే కాకుండా మా వి.ఎస్.యూ యన్ ఎస్ ఎస్ యూనిట్ మొత్తానికి దక్కిన గౌరవం. సమాజ సేవలో మరింత కృషి చేస్తూ, గ్రామీణాభివృద్ధి మరియు యువత శ్రేయస్సు కోసం పనిచేస్తాను" అని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు, భోధన, భోధనేత్రర సిబ్బంది యన్ ఎస్ ఎస్ వాలంటీర్లు మరియు యన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు అతనికి అభినందనలు తెలిపారు.

# విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పోటీ పరీక్షల కేంద్రం ప్రారంభించింది

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమసింహపురి విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పోటీ పరీక్షల కేంద్రంను స్థాపించింది. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులకు UPSC, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు మరియు వివిధ కార్పొరేట్ పరీక్షలపై అవగాహన, మార్గదర్శకత్వం, శిక్షణ, కోచింగ్ అందించనుంది. ఈ కేంద్రం విద్యార్థులను సమర్థులైన, బాధ్యతాయుతమైన ప్రజాసేవకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకుంది. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జె.విజేతను ఈ కేంద్రానికి డైరెక్టర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొ.అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డా. కె.సునీత, కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ. సిహెచ్ విజయ తదితరులు డా.విజేతను అభినందించారు. అధికారులు పేర్కొంటూ, ఈ కేంద్రం విద్యార్థులకు ప్రేరణాత్మక అవకాశాలను అందించి, భవిష్యత్తులో సమాజం పట్ల బాధ్యత కలిగిన సమర్థవంతమైన నాయకులుగా ఎదగడానికి దోహదం చేస్తుందని తెలిపారు.




# రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, నిర్మాణాలను తప్పనిసరిగా తొలగిస్తాం : కమిషనర్ వై.ఓ. నందన్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లను ఆక్రమిస్తూ దుకాణాల ఏర్పాటు కోసం నిర్మాణాలు చేపట్టవద్దని, నగరాభివృద్ధిలో భాగంగా మార్జిన్ దాటిన నిర్మాణాలను తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ వై.ఓ. నందన్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వై.ఓ. నందన్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వ స్థలాలు, కార్పొరేషన్ స్థలాలు, ఫుట్ పాత్‌లు ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్. పొంగూరు నారాయణ, రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల సూచనల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్దేశించిన జోన్లలో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకునేలా రోడ్డు మార్జిన్ వ్యాపారులకు మార్గదర్శకాలను రూపొందిస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. నిర్దేశించిన రోడ్డు మార్జిన్ ప్రతి ఒక్కరు గుర్తించేలా అన్ని ప్రాంతాలలో మార్కింగ్ చేయనున్నామని కమిషనర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 3, ఆప్కాస్ 7, అడ్మినిస్ట్రేషన్ 2, ఇంజనీరింగ్ 6, హౌసింగ్ సెక్షన్ 18, పబ్లిక్ హెల్త్ 4, రెవెన్యూ 5, టౌన్ ప్లానింగ్ 8, మొత్తం 53 వినతులను కమిషనర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి, టి.పి.ఆర్.ఓ. వాసు బాబు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యంతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రాంజీ నగర్‌లో మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యంని వారి నివాసంలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో పలు విషయాలను చర్చించారు.

# వరల్డ్ టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వరల్డ్ టీచర్స్ డే సందర్భంగా ఇందుకూరు ప్రభాకర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వారు జిల్లాలోని ప్రతి మండలం నుండి ఒక్కొక్క ఉపాధ్యాయులను సెలెక్ట్ చేసి సన్మానించడం జరిగింది ఈ క్రమంలో మనుబోలు మండలం వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్ సరస్వతిని ఈ మండలం నుండి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపిక చేయడం జరిగింది. నెల్లూరు టౌన్ హాల్లో జరిగిన సభలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు సరస్వతికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసి అభినందించడం జరిగింది.

# ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విజయవంతం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని ప్రజలందరి భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో 2025 స్వచ్ఛత అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విజన్ 2047 లో భాగంగా స్వచ్ఛంద కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు గౌరవ ముఖ్యమంత్రి పది సూత్రాల కార్యక్రమం నిర్దేశించారన్నారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు అయితేనే తమ తమ పరిసరాలు పరిశుభ్రంగా మారతాయని వివరించారు. గ్రామస్థాయి నుండి వివిధ వర్గాల వారికి స్వచ్ఛత అవార్డులు ప్రకటించడం సంతోషదాయకమని వారి స్ఫూర్తితో మిగతావారు సైతం స్వచ్ఛత కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. తమ తమ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలనే తలంపు ప్రతి ఒక్కరిలో ఉన్నప్పుడే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ప్రజలందరి భాగస్వామ్యంతో స్వచ్ఛంద కార్యక్రమంలో జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగమవ్వాలని కోరారు. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల కృషితోనే పట్టణాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ దృష్ట్యా పరిసరాల పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.

ముఖ్యమంత్రి సైతం ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తు న్నారన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామాలు పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మన ఊరిని మన ప్రాంతాన్ని ప్రేమించినప్పుడే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే అభిప్రా యం కలుగుతుందన్నారు. కష్టపడి పని చేసే వారికి ఇటువంటి అవార్డులతో గుర్తించినప్పుడే మరింత ద్విగుణీకృతమైన ఉత్సాహంతో పనిచేస్తారన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ఉద్యమ స్ఫూర్తితో పనిచేసినప్పుడే ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, డిపిఓ శ్రీధర్ రెడ్డి, డీఈవో బాలాజీ రావు, డిఆర్డిఏ పిడి నాగరాజ కుమారి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ విజయ భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కరపలో బైక్ ప్రమాదం - యువకుడు అపస్మారక స్థితి

**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ మండలం కరప నక్కావారిపేటలో బైక్ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బిక్కవోలు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఉల్లం కామరాజు అనే యువకుడు కరప చిరంజీవి కళ్యాణ మండపంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలో పాల్గొని బంధువులను కలిసి తిరుగు ప్రయాణం బుల్లెట్ బైక్‌పై వెళుతుండగా అదుపు తప్పి స్థానిక బ్రిడ్జిని ఢీకొన్నాడు. దీంతో యువకుడు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఘటనను గమనించిన స్థానికులు అంబులెన్స్ సేవలకు సమాచారం అందించి, గాయపడిన కామరాజును 108 సిబ్బంది సహాయంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిం చినట్లు తెలిపారు. ఈ ఘటనపై కరప ఎస్ఐ తోట సునీత స్పందిస్తూ బుల్లెట్ బైకును పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్ అస్మా మైనుద్దీన్

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక 52 డివిజన్లో మున్సిపల్ శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ సహకారంతో ముస్లిం వీధి నందు పాత స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల, పనులకు నేడు పూజా కార్యక్రమాలతో ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ అస్మా మైనుద్దీన్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులన్నీ కూడా నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ సహకారంతో తమ డివిజన్లో అభివృద్ధి పనులు సరవేగంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా కార్పొరేటర్ అస్మా మైనుద్దీన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

## - నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులను అరికట్టేందుకు ప్రత్యేక అంతర్గత తనిఖీ బృందాలు - యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి - ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు - ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 83310 57285 ఏర్పాటు : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని..నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులను పూర్తిగా అరికట్టేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అంతర్గత తనిఖీ బృందాలను నియమించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు సంబంధించి నకిలీ విత్తనాలు, ఎరువులు, అక్రమ యూరియా నిల్వలపై ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఈ సమస్యలపై ఫిర్యాదులు ఉన్నట్లయితే అన్నదాతలు వెంటనే జిల్లా వ్యవసాయ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 83310 57285 కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. జిల్లాలో కల్తీ విత్తనాలు, అక్రమ యూరియా నిల్వలపై ప్రత్యేక బృందాలు తనిఖీలను ముమ్మరం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ ప్రత్యేక బృందాలు క్రమపద్ధతిలో డీలర్లు, గోదాములు, స్టాక్ పాయింట్లలో యూరియా సరఫరా, నిల్వలు, వినియోగంపై సమగ్ర స్టాక్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలకు అక్రమ రవాణా, అనధికార వినియోగాన్ని అరికట్టడం, క్రమం తప్పకుండా ఫీల్డ్ స్థాయి తనిఖీలు చేయడం, వ్యవసాయ అధికారులను సమన్వయం చేస్తూ పర్యవేక్షణ చేయడం ఈ ప్రత్యేక బృందాలను ప్రధాన లక్ష్యంగా ఆయన చెప్పారు. జిల్లాలోని రైతులకు సమయానుకూలంగా నాణ్యమైన ఎరువులు అందేలా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. యూరియా దుర్వినియోగం మాత్రమే కాకుండా, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలలో కల్తీ లేదా అవకతవకలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. ఉల్లంఘనలకు పాల్పడిన డీలర్ల లైసెన్సులు రద్దు చేయడం, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆ ప్రకటనలో కలెక్టర్ తెలిపారు.

# చిరు వ్యాపారుల కళ్ళల్లో ఆనందం చూస్తున్నాం

## - రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పేదరికం నుంచి వచ్చాను కాబట్టే పేదల కష్టాలు తెలుసని.., అందుకే సొంత నిధులతో తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.. నెల్లూరు గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం 75 మంది పేదలకు తోపుడు బండ్లు మంత్రి అందజేశారు. అందులో 70 తోపుడు బండ్లు, ఐదు ఇస్త్రీ బండ్లు అందించారు. ఇప్పటివరకు 476 మందికి తోపుడు బండ్లు మంత్రి ఆధ్వర్యంలో అందజేశారు. పూరి గుడిసెలో పుట్టి ఎన్నో కష్టాలు పడ్డానని, తనకు కష్టం విలువ తెలుసు కాబట్టే పేదలకు సాయం చేస్తున్నాని, పేదలు నిరుపేదలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. తమ కష్టాలను తెలుసుకొని తమకు అండగా నిలిచిన మంత్రి నారాయణ కు చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ తోపుడు బండ్ల పంపిణీని కూడా వైఎస్సార్సీపీ నేతలు అడ్డుకున్నారని..ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే పేదలకు సహాయం అందకుండా చేసారని మండిపడ్డారు.. హైదరాబాద్ నుంచి తోపుడు బండ్లతో వస్తున్న లారీని సీజ్ చేయించారన్నారు.. ఎన్నికల ప్రచారంలో వీధి వ్యాపారుల జీవన శైలి చూసానని.. అద్దెకు బండ్లు తీసుకొని వ్యాపారాలు చేసేవారు ఎక్కువ అని..అద్దె చెల్లించే అవసరం లేకుండా అండగా నిలుస్తానని ఆ రోజే హామీ ఇచ్చినట్లు తెలిపారు..లాండ్రీ వృత్తి చేసే పేద రజకులకు ఇస్త్రీ బండ్లు పంపిణీ చేస్తున్నానని.. నా కుటుంబ సభ్యులు కూడా పేదల పక్షపాతులు అని నారాయణ తెలిపారు. స్మార్ట్ స్ట్రీట్ లో వ్యాపారాలు చేసే 120 మంది మెప్మా మహిళలకు ఒక్కొక్కరికి లక్ష ఆర్థిక సహాయం ఇచ్చానన్నారు.. సీఎం ప్రవేశ పెట్టిన పి4 ద్వారా పేదకుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు.. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. అనంతరం రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ 75 మంది వీధి వ్యాపారులకు మంత్రి నారాయణ ఒకేసారి తోపుడుబండ్లు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఎన్నికలు అయిపోయాక 476 తోపుడు బండ్లు పంపిణీ చేసారు చెప్పారు.. ఆపద వస్తే నేనున్నాననే భరోసా ఇచ్చే వ్యక్తి మంత్రి నారాయణ సార్ అని అన్నారు. నారాయణ సార్ లాంటి నాయకుడు చిక్కటం సిటీ వాసుల అదృష్టం అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, క్లస్టర్ ఇన్చార్జులు, డివిజన్ ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# హారిణి క్యాటరింగ్స్, హారిణి హొటల్‌ను ప్రారంభించిన కోటంరెడ్డి సోదరులు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక శ్రీహరి నగర్ లో హరిణి క్యాటరింగ్, హరిణి హొటల్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిణి క్యాటరింగ్స్ హొటల్ అధినేత పెంచలయ్య (సీపీ)కి అభినందనలు తెలియజేశారు. వ్యాపారం బాగా జరగాలని ఆకాంక్షించారు. అనంతరం కార్పొరేటర్ చేజర్ల మహేష్ మాట్లాడుతూ పెంచలయ్య హొటల్ పరిశ్రమలో ఎన్నో ఏళ్లుగా ఉన్నారని నెల్లూరు ప్రజల అభిరుచికి అనగుణంగా అల్పాహారంతో పాటు చక్కటి వంటకాలతో హొటల్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకొని వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ, నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్ రెడ్డి, శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ ఓట్టూరు సురేంద్ర యాదవ్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసరెడ్డి, మూలే విజయభాస్కర్ రెడ్డి, తెలుగు దేశం పార్టీ నాయకులు నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, అరవ శ్రీనివాసులు, కరణం హజరత్ నాయుడు, చెక్క సాయి సునీల్, నెల్లూరు క్లబ్ కార్యదర్శి అశోక్, సాబీర్ ఖాన్, లీలా, యానాదయ్య, కోటిరెడ్డి, హరికృష్ణ, సుధాకర్, తోట శోభారాణి, చేజర్ల కవిత, పద్మజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యం

## - ప్రతి అర్జీని జాప్యం లేకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అర్జీదారులు సంతృప్తిచెందేలా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో పాటు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవాని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పట్ల జాప్యం లేకుండా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ఏ శాఖ పరిధిలో కూడా అర్జీలు పెండిరగ్‌లో ఉండకూడదన్నారు. ప్రతిరోజూ తమ లాగిన్‌లలో అర్జీలను స్టేటస్ పరిశీలించి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయండి : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమిలి, (రాజధాని వార్తలు):** దేశంలోనే భీమిలి ప్రాంతానికి సుదీర్ఘ చరిత్ర ఉందని ఎంతో చరిత్ర ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు భీమిలి జోనల్ కమీషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడికి వినతిపత్రం ద్వారా కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భీమిలి జోన్ 3వ డివిజన్లో ఉన్నా పలు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రంలో ప్రప్రథంగా, దేశంలోనే రెండవదిగా భీమిలి మున్సిపాలిటీ అవతరించిందని అన్నారు. 1861లో భీమిలి మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతం ఎంతో ప్రాచుర్యం సంపాదించిందని ఆంగ్లేయుల పాలనలో ఉన్న సమయంలో ఇక్కడ నుండే సరుకులు ఎగుమతులు దిగుమతులు సాగించేవారని ఓడరేవుగా ప్రసిద్ధి చెందిన భీమిలి నేడు అభివృద్ధికి నోచుకోక స్టబ్దుగా ఉందని అన్నారు. హుదూద్ తుపానుక ముందు ఈ ప్రాంతంలో భీముడు – బకాసురుడు, ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానంద, పంచపాండవుల విగ్రహాలు, మత్స్యకారుడు–పడవ, తీరంలో వినాయకుని గుడి, సముద్రపు అలల ప్రాంతంలో చిన్నచిన్న సాగరకన్య విగ్రహాలు ఇలా ఎన్నో ఆకృతులు ఉండేవని అవన్నీ హుదూద్ తుపానుకు కొట్టుకుపోయిన తర్వాత భీమిలి ప్రాంతం అలాగే ఉందని పురాణ చరిత్ర ఆదారంగా పంచపాండవులు భీమిలి ప్రాంతంలో సంచరించేవారని, దానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయని భీముడుకి, బకాసురుడికి భీమిలి కొండపై సుదీర్ఘ యుద్ధం జరిగిందని భీముడు బకాసురుడిని చంపి ఈ ప్రాంతవాసులను కాపాడిన సందర్భంగా భీమునిపట్నం అనే పేరు సార్ధకమయిందని చెబుతారని అన్నారు భీముడు త్యాగానికి ప్రతిఫలంగా గోస్తనీ నదిలో భీముడు నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. అదేవిదంగా 3వ వార్డులో ఉన్న ఐదు సచివాలయంలలో కంప్యూటర్స్ పనిచేయడం లేదని దీని కారణంగా ప్రజాసేవలకు అంతరాయం కలుగుతుందని సచివాలయం వ్యవస్థలో ఉన్న లోపాలను సరిచేసి సేవలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడవలసినదిగా విజ్ఞప్తి చేసారు. భీమిలి బీచ్, జమ్మిచెరువు, నేరళ్లవలస వద్ద ఉన్న ఓపెన్ జిమ్ యొక్క పరికరాలు తుప్పుపట్టి పాడై ఉన్నాయని వాటిని మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని గొల్లలపాలెం సామాజిక భవనం వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ అభివృద్ధి చేసినట్లయితే స్థానికులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని గంటా నూకరాజు వినతిపత్రంలో కోరారు.

# అజీజ్ భాయ్ వక్ఫ్ బోర్డ్ స్థలాలను ఏమి చేయాలనుకుంటున్నావ్

## - వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సమీర్ ఖాన్









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జామియా మసీదు స్థలాలను ఎవరికి ధారాదత్తం చేస్తున్నారు...నాలుగు ఎకరాలు మీరు పెట్టుకుని ఎనిమిది ఎకరాలు ఇతర సంస్థలకు ఇస్తారా...ఈ స్థలంలో మసీదు కడతారా...హాస్టల్ కడతారా...సమాధానం చెప్పండి... కనీసం మాస్టర్ ప్లాన్ లేకుండా జామియా మసీదుకు సంబంధించిన స్థలాన్ని ఎలా చదును చేస్తారు...

చదును చేస్తున్న సంస్థలకు మీకు ఉన్న సంబంధం ఏమిటి...జామియా మసీదును స్థలాన్ని కాజేసేందుకు కొంతమంది కుట్ర పన్నుతున్నారు... దీనిపై వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సమాధానం చెప్పాలి.


# సంపాదకీయం


## రైతు క్షేమమా ట్రంప్ స్నేహమా ఏది ముఖ్యం

అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య ఒప్పందాలు, వాటికి సంబంధించిన సంస్థలు అన్నీ సంపన్న దేశాల ప్రయోజనాల కోసమే ఉన్నాయన్నది కాదనలేని నిజం. కాకులను కొట్టి గద్దలకు వేసినట్టు పేద, వర్ధమాన దేశాల మీద అభివృద్ధి చెందిన దేశాల పెత్తనాన్ని బలోపేతం చేయడానికే అవి అవతరించాయి. అప్పటికీ సంతృప్తి చెందని అమెరికా ఈ ఒప్పందాలు నిర్దేశించిన నియమాలను కూడా కాలరాస్తున్నది. అమెరికా తన రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తూ, వారు పండించిన పంటలను తక్కువ ధరలకు ఎగుమతి చేసుకొని లాభపడేలా చూస్తున్నది. ఇది వర్ధమాన దేశాల్లో వ్యవసాయ సంక్షోభాన్ని సృష్టిస్తున్నది. ఇంకా జన్యుమార్పిడి పంటల భారీ ఎగుమతి, వాణిజ్య పంటల సాగును మితిమించి ప్రోత్సహించడం వంటి చర్యలతో అమెరికా వంటి సంపన్న దేశాలు పేద దేశాల సాగు వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఆహారభద్రతకు హాని తెస్తున్నాయి. అంతర్జాతీయ ఒప్పందాలు ఎంతగా సంపన్న దేశాలకు, బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు దాస్యం చేస్తున్నప్పటికీ వర్ధమాన దేశాల మేలు కోరి ఒకటీ అరా నియమాలను చేర్చకపోలేదు. 1995లో ఏర్పాటైన ప్రపంచ వాణిజ్య సంస్థ సభ్యదేశాలు పరిమిత సుంకాలకు కట్టుబడాలనే నియమాన్ని విధించింది. ఈ సుంకాలను దాటాలంటే చర్చలు తప్పనిసరి అనే నిబంధననూ చేర్చింది. ఈ 'tariff bindings' ప్రకారం అమెరికా అన్ని రకాల విదేశీ సామగ్రి పైన సగటున 3.4 శాతానికి మించి సుంకాలను విధించకూడదు. అయితే చివరకు ఈ నిబంధనలన్నీ ఏనుగును పురికొస తాళ్లతో బంధించినట్లే అయ్యింది. అమెరికా విశృంఖలత్వాన్ని ఆపే శక్తి వీటికి కొరవడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఇండియా తదితర వర్ధమాన, పేద దేశాలకు కొన్ని వెసులుబాట్లు కల్పించింది. వాటినే ప్రత్యేక వెసులుబాట్లుగా పరిగణిస్తారు. విదేశీ వస్తువుల మీద తాము విధించే అధిక సుంకాలను క్రమక్రమంగా తగ్గించే అవకాశాన్ని ఈ నిబంధన అభివృద్ధి చెందుతున్న దేశాలకు కల్పించింది. దేశీయ కీలక రంగాలను సంపన్న దేశాల సరకుల దాడి నుంచి కాపాడుకోవడంలో ఇండియాకు ఈ ఎస్‌టీడీ ఉపయోగపడుతున్నది. ఆర్థిక బలహీన దేశాలు తమ వ్యవసాయాది రంగాలను కాపాడుకోడానికి సంపన్న దేశాల ఉత్పత్తులపై అధిక సుంకాలు వసూలు చేయడానికి ఈ వెసులుబాటు అవకాశమిస్తున్నది. ఇండియా భారీ సుంకాలు విధిస్తున్నదని ట్రంప్ గగ్గోలు పెట్టడానికి ఇదే కారణం. ఇవి నియమబద్ధ సుంకాలు. ఇండియాతో వాణిజ్య లోటు తగ్గించుకోడానికి స్టీల్ దిగుమతుల మీద 25శాతం, అల్యూమినియం మీద 10 శాతం సుంకాలను అమెరికా విధించి ఉంది. అమెరికా వాణిజ్య చట్టం 232 సెక్షన్ కింద జాతీయ భద్రతావసరాల కోసం వీటిని విధించినట్టు చెప్పుకున్నది. వాణిజ్య ఒప్పందాలను జాతీయ భద్రత పేరుతో ఉల్లంఘించడం అక్రమమని ప్రపంచ వాణిజ్య సంస్థ తీర్పు ఇచ్చింది. అయినా అమెరికా దూకుడు ఆగలేదు. వాణిజ్య రంగంలో ఇండియాను బూటు కాళ్లతో తొక్కిపట్టి తన షరతులకు అంగీకరింపజేయాలని ట్రంప్ తెగబడుతున్నాడు. ప్రధాని మోదీ తన సన్నిహిత మిత్రుడు అంటూనే భారతీయ సరకులపై 25శాతం సుంకంతో బాటు రష్యా నుంచి క్రూడాయిల్‌ను కొంటున్నందుకు అదనంగా మరి 25శాతం, మొత్తంగా 50 శాతం సుంకాలను విధించాడు. ట్రంప్ విధించిన ఈ 50శాతం సుంకాలు అమెరికాకు భారతీయ ఎగుమతులను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. ఆగస్టు 6 వరకు 10 శాతం సుంకాలనే భరించిన ఇండియా ఆ నెల 27 వరకు 25 శాతం, ఆ తర్వాత నుంచి 50 శాతం సుంకాలను చెల్లిస్తున్నది. ఈ విధంగా అధిక సుంకాల భారం ఆగస్టులో పరిమితమే అయినప్పటికీ ఆ కొద్ది రోజుల్లోనే ఇండియా నుంచి అమెరికాకు స్మార్ట్ ఫోన్ల ఎగుమతులు 58శాతం తగ్గిపోయాయి, మందుల ఎగుమతులు 13.3శాతం పతనమయ్యాయి. అల్యూమినియం 19శాతంబీ ఇనుము, స్టీలు 13.1 శాతంబీ రాగి 10.2 శాతం పడిపోయాయి. రొయ్యల వంటి సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతులు 43.8శాతం దెబ్బతిన్నాయి. ఈ అన్ని రంగాల్లోను దేశంలో ఉద్యోగాలు గణనీయంగా మాయమయ్యాయి. నిరుద్యోగం ప్రబలుతున్నది. వాస్తవానికి ఇండియాపై ట్రంప్ కోపానికి కారణం మనం రష్యా నుంచి ఆయిల్ కొనడం ఒక్కటే కాదని, అమెరికా నుంచి జన్యు మార్పిడి మొక్కలను (మొక్కజొన్న) కొనుగోలు చేయకపోడమేనని స్పష్టపడిపోయింది. '140 కోట్ల జనాభా గల ఇండియా అమెరికా నుంచి ఒక బషేల్ (27.2 కిలోలు) మొక్కజొన్న కొనలేదా?' అని అమెరికా వాణిజ్య మంత్రి హొవర్డ్ లుట్నిక్ హుంకరించాడు. 'ఇండియా మెడలు వంచి అమెరికా మొక్కజొన్నను కొనిపిస్తాం చూడండి' అని గాండ్రించాడు. ప్రపంచంలోని అత్యధిక మొక్కజొన్న ఉత్పత్తిదార్లలో ఇండియా ఐదవ స్థానంలో ఉంది. దాని పంటే దానికి ఎక్కువైపోతున్నప్పుడు దానిని దిగుమతి చేసుకోవలసిన అవసరం ఇండియాకు లేదు. ఇండియాలో 50 కోట్లమంది వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. ఇలాంటప్పుడు అధిక సబ్సిడీల చౌక వ్యవసాయోత్పత్తులను అమెరికా నుంచి దిగుమతి చేసుకొని దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసుకోడం అంటే తానెక్కిన కొమ్మను నరుక్కోడమే అవుతుంది. ట్రంప్ ప్రకటించిన ఏకపక్ష టారిఫ్ యుద్ధం అమెరికాకు మేలు చేయకపోగా తీవ్ర సంక్షోభాన్ని దాని మెడకు చుడుతున్నది. ధరలు పెరిగిపోయి అమెరికా పౌరుల జేబులు గుల్ల అయ్యే పరిస్థితి తలెత్తింది. చైనా మీద సుంకాలు పెంచడంతో అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి చేసుకోవడం అది మానుకున్నది. ప్రపంచంలో పండే సోయాబీన్ పంటలో 60 శాతాన్ని చైనా దిగుమతి చేసుకుంటున్నది.

# కన్నుల పండుగగా స్వర్ణాంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రధానం

## - కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న గ్రామాల ప్రజా ప్రతినిధులు







**అమలాపురం, (రాజధాని వార్తలు):** స్వచ్ఛత కార్యక్రమాల్లో అగ్రగామిగా గ్రామాలను నిలపడం, గ్రామాల మధ్య స్వచ్ఛతలో పోటీ తత్వాన్ని పెంచేందుకు ప్రేరణగా స్వచ్ఛత అవార్డులు నిలుస్తాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. అమలాపురం సత్యనారాయణ గార్డెన్‌లో జిల్లా స్థాయిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రధానోత్సవం 2025ను సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో వివిధ కేటగిరీలలో అవార్డులు ప్రధానం చేశారు. స్వచ్ఛత రంగంలో గుర్తింపు పొందిన మునిసిపాలిటీలకు, గ్రామ పంచాయితీల కు, స్కూల్స్, ఆసుపత్రులు, కార్యాలయాలు, రైతు బజార్లు, బస్సు స్టేషన్లు, పారిశుధ్య కార్మికులు, స్వయం సహాయక సంఘాలకు ఈ అవార్డులు దానం చేశారన్నారు. స్వచ్ఛత, పారిశుద్ధ్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, ఘనీభవ ఆర్థిక వ్యవస్థ ప్రోత్సాహం వంటి విధానాలను పురోగమింప చేసేందుకు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవార్డు విధానాన్ని ప్రత్యేక గుర్తింపుగా రూపొందించి నాగరికత పోటీగామార్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అవార్డుల ఎంపికలో పారదర్శకతను పాటించడానికి, స్వతంత్ర సంస్థల ద్వారా ఎంపిక చేయడం జరిగిందన్నారు. అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు మాట్లాడుతూ చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలలో అత్యుత్తమ కృషి చేసిన వారిని, ముఖ్యంగా పారిశుధ్య కార్మికులను స్వచ్ఛతా యోధులు గ్రీన్ అంబా సిడర్‌లను స్వయం సహాయక సంఘాలను సత్కరిం చడం సంతోషదాయకమన్నారు. స్వచ్ఛతను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగాకాకుండా, ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన జీవన విధానంగా మార్చ డానికి ప్రజల్లో అవగాహన కల్పించడం వారిని ప్రేరేపించడం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుల తరహాలోనే జిల్లా స్థాయిలో ఒక వ్యవస్థను ఏర్పాటుచేసి స్వచ్ఛత ప్రమాణాలను పెంచడం, తద్వారా జిల్లాను పరిశుభ్రమైన, పచ్చని, ఆరోగ్యకరమైన జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. స్థానికమున్సిపల్ కమిషనర్ వి నిర్మల్ కుమార్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు స్వచ్ఛ ఆంధ్ర మిషన్‌కు మరింత జవాబుదారీతనం, పారదర్శకత ప్రేరణ ఇవ్వడానికి ఉద్దేశించబడ్డాయన్నారు. ఉత్తమ స్వచ్ఛత హరిత అంబాసిడర్లగా ఉండ్రా జవరపు మారేష్, (డాంగేరు గ్రామం కే.గంగవరం మండలం), 2.కొల్లు అర్జున రావు, పాలగుమ్మి, 3.యార్లగడ్డ వెంకాయమ్మ, సాకుర్రు. 4.చంద్రమల్ల చంద్రరావు, పాలతోడు, 5. పెయ్యల వెంకట్రావు, భట్నవిల్లి, 2. ఉత్తమ స్వచ్ఛత ఎన్జీవో 1. వశిష్ట లయన్స్ క్లబ్, అమలాపురం. 2.ఆక్సిజన్ అసోసి యేషన్, మామిడి కుదురు, 3. సేవ్ నేచర్ మహిళా సంఘం, కేశనకుర్రు, 3. ఉత్తమ స్వచ్ఛత యోధులు, 1.రేలంగి సత్య నాగేశ్వరరావు, అమలాపురం మునిసిపాలిటీ, 2.యార్లగడ్డ సుబ్బాయమ్మ, అమలాపురం మునిసిపాలిటీ. 3.బొట్టా సూరిబాబు, మండపేట మునిసిపాలిటీ, 4. వడ్డాడి దుర్గారావు, మండపేట మునిసిపాలిటీ, 5.వడ్డాది సతీబాబు, రామచంద్రపురం మునిసిపాలిటీ, 6. స్వచ్ఛ అంగన్వాడీలు 1. అమలాపురం అంగన్‌వాడీ. 2. జొన్నాడ అంగన్ వాడి, 3.మలికిపురం అంగన్‌వాడి 4. మారేడుబాక అంగన్‌వాడి, 5. పాతగన్నవరం అంగన్‌వాడి. 5. స్వచ్ఛ బస్ స్టేషన్లు 1.రామచంద్రపురం బస్ స్టేషన్. 6. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు 1.కలెక్టరేట్, అమలాపురం, 2. మండపేట మునిసిపాలిటీ 3. ఎంపీడీవో ఆఫీస్, కొత్తపేట. 7. స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా దంగేరు 1. దంగేరు, 2. కొమర గిరిపట్నం, 3.పాలతోడు, 4.శివకోడు, 8. స్వచ్ఛ హాస్పిటల్స్ 1.పిహెచ్‌సి అల్లవరం, బెండమూరిలంక 2 పీహెచ్సీ గోపాలపురం 3.కమ్యూనిటీ హెల్త్ సెంటర్, కొత్తపేట, 9. స్వచ్ఛ హాస్టళ్లు 1. ఎస్‌డబ్ల్యు బాలికల ఐడబ్ల్యూహెచ్‌సి రాజోలు, 2. ప్రభుత్వ బిసి కళాశాల బాలుర హాస్టల్, రాజోలు. 2. 10. స్వచ్ఛ పరిశ్రమలు అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, గోపాలపురం 2.ఎన్ ఎ సి ఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఈతకోట, 11. స్వచ్ఛ మునిసిపా లిటీలు 1.మండపేట మునిసిపాలిటీ. 12. స్వచ్ఛ గురుకుల పాఠశాలలు 1.డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ గురు కులం, (బాలురు) గోడి, కొమర గిరిపట్నం 13. స్వచ్ఛ రైతు బజార్లు. 1.రామచంద్రపురం రైతు బజార్. 14. స్వచ్ఛ పాఠశాలలు 1.ఎంపీపీ ఎంపీ ఎస్, మడికి, 2.జి హెచ్ ఎస్‌అలమూరు. 3. జూనియర్ ఎం పి ఎల్ కొంకపల్లి, అమలాపురం. 4.ఎస్పై జి ఎం పి ఎల్ సి హెచ్ ఎస్ నగర్, రామచంద్రపురం 5. జడ్పీహెచ్‌ఎస్ రాయవరం. 15. స్వచ్ఛ ఎస్ ఎల్ ఎఫ్ ఎస్. 1.భాను ఎస్ ఎల్ ఎఫ్, కొత్త హరిజన పేట.

# అంతర్వేది హార్బర్ నిర్వహణ ఆర్ఆర్ ఏజెన్సీ చేతికి





**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పల్లిపాలెం హార్బర్ నిర్వహణను ఆర్ ఆర్ ఏజెన్సీకి అప్పగించినట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు.కలెక్టరేట్‌లో రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించి హార్బర్ అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు రూ. 26 లక్షలతో వివిధ పనులకు అంచనాలు రూపొందించడం జరిగిందని ఈ పనులు నవంబర్‌లోపు పూర్తి చేసి నవంబర్ నుండి హార్బర్ నిర్వహణను ఆర్ ఆర్ ఏజెన్సీకి అప్పగించడం జరుగుతుందన్నారు. భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ విభాగం జల జీవన్ మిషన్ ద్వారా హార్బర్ అవసరాల నిమిత్తం వాటర్ ట్యాంకును నిర్మించాలని ఉపాధి హామీ అనుసంధానంతో అప్రోచ్ రోడ్డును, విద్యుత్ సరఫరాను ఏపీ ఈపీడీసీఎల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒప్పందపు పత్రాలపై ఆర్డిఓ, మత్స్యశాఖ సంతకాలు చేయాలని ఆయన ఆదేశించారు. హార్బర్ నిర్వహణ ద్వారా అంతర్వేది ప్రాంతంలో మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పరిచయల చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. పొదలు తొలగింపు నిఘా నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు పూర్తి స్థాయి వసతుల కల్పన కల్పించి సమర్థవంతంగా నిర్వహణ చేపట్టి స్థానిక సముద్ర తీర మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని అధికారులను శాసనసభ్యులు వరప్రసాద్ కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జా యింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆర్ ఆర్ ఏజెన్సీ ప్రతినిధులు, ఆర్డీవో కే మాధవి, జిల్లా మత్స్య శాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ ఏవీఎస్ రామన్ ట్రాన్స్కో ఎస్సీ బి రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కుల మతాల ప్రస్తావన లేని గ్రంధం భేష్



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ఒకే దేవుడు ఒకే దేశము అనే నినాదం చాలా గొప్పది అనే నినాదంతో కుల మతాల ప్రస్తావన లేకుండా రచించిన గ్రంధం భేష్ అని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామ స్వామి బాబు అన్నారు. పెద్దాపురం పట్టణం కొప్పుల వెలమ కళ్యాణ మండపంలో శ్రీమన్నారాయణ శ్రీ లహరికృష్ణ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక గ్రంథవిష్కరణ మహోత్సవము ఘనంగా జరిగింది. పెద్దాపురం పట్టణంలో "అమృత మంజరి- అంకురాం 2" "తన ప్రేమగల చేతుల నైపుణ్యం" అనే పుస్తకాన్ని ముఖ్య అతిధి డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆవిష్కరణ కర్త తుమ్మల రామస్వామి మాట్లాడుతూ కుల ప్రస్తావన గాని, మత ప్రస్తావన గాని లేకుండా మనుషులంతా ఒకటే అని నినాదాన్ని ప్రవేశపెట్టిన ఈ లహరి కృష్ణ సంస్థ చాలా గొప్పదన్నారు. ఇలాంటి సంస్థలో మీరందరూ భాగస్వాములయ్యి నా చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషమ న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, పెద్దాపురం జనసేన పార్టీ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, పెద్దాపురం జనసేన పార్టీ 20 వార్డు కౌన్సిలర్ ఓబుల శెట్టి గుణేశ్వరరావు, శ్రీలహరి కృష్ణ, నిర్వాహకుడు ఎస్.రాజు సాహితీ స్రవంతి సభ్యులు పాల్గొన్నారు.

# "అందరికీ త్రాగునీటి భద్రత" పై 5 జిల్లాల అధికారులకు శిక్షణ

## - ఆర్ డబ్ల్యూ ఎస్ ఛీఫ్ ఇంజినీర్ ఇషాన్ బాషా






**సామర్లకోట, (రాజధాని వార్తలు):** జల జీవన్ మిషన్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటి భద్రత కల్పించేందుకు త్రాగు నీటి పథకాలు రానున్న మూడేళ్ళలో పూర్తి చేసుకో వాలని గ్రామీణ నీటిపారుదల విభాగం చీఫ్ ఇంజినీర్ ఇషాన్ భాషా పిలుపునిచ్చారు. ప్రజలందరికీ తాగునీటి భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో గ్రామ, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. నీటిపారుదల విభాగం ఎఈలు, డిప్యూటీ ఎంపీడీఓలకు ఈ అంశంపై తొలి బ్యాచ్ శిక్షణ తరగతులను సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో సోమవారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో ప్రమాణాలు పాటించని ఆర్వో కేంద్రాల నీటి వాడకం బాగా పెరిగిపోయిందన్నారు. దీని వలన ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నా యని ఆయన అన్నారు. ఈ శిక్షణ తర్వాత త్రాగునీటి సరఫరా, నాణ్యత మెరుగుపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యంలో కీలకమైన తాగునీటి పథకాల నిర్వహణలో భాగస్వాములు సమన్వయంతో పనిచేయాలని శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ కె.ఎన్.వి. ప్రసాదరావు సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో త్రాగునీటి శుద్ధి యూనిట్లను వారు పరిశీలించారు. తొలి బ్యాచ్‌లో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన 40 మంది మూడు రోజుల శిక్షణ తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. అలాగే ఈ నెల 6 నుంచి 17 వరకు బ్యాచ్‌ల వారీగా 402 మందికి ఈ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. వీరి తర్వాత గ్రామ స్థాయి అధికారులైన ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కూడా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ డబ్ల్యూ ఎస్ కాకినాడ ఎస్‌ఇ అబ్దుల్ మధీన్, రిటైర్డ్ ఎస్‌ఇ ఉమాశంకర్, పెద్దాపురం డీఇ స్వామి, ఇ.శ్రీరామ్, ఈటీసీ వైస్ ప్రిన్సిపల్ జి.రమణ, చీఫ్ ఇన్స్ట్రక్టర్ డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్వో ప్లాంట్ ప్రారంభ కార్యక్రమం



**కందుకూరు, (రాజధాని వార్తలు):** కందుకూరు ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను డిపో మేనేజర్ రాపూరి శ్రీనివాసులు ప్రారంభించారు. అన్నంగి వెంకటరత్నం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సావిటర్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నంగి వెంకట రమేష్ సహకారంతో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసామని చెప్పారు. ఈ ప్లాంటును డీఎంతో పాటు రమేష్ మామ ఉమ్మడిశెట్టి సుబ్బారావు చేతుల మీదుగా ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్యాంప్రసాద్, టిఐ 3 హనుమంతరావు, రిటైర్డ్ కండక్టర్ పద్మారావు, డిపో ఉద్యోగులు కస్తూరి రమేష్, మహేష్, సుబ్బారావు, సురేష్, కృష్ణ, అధిక సంఖ్యలో ప్రయాణికులు పాల్గొని విజయవంతం అయిందని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని ప్రయాణికులు, స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

# రష్మికకు పోటీగా నోరా ఫతేహి.. బీట్ చేయగలదా?





ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా కాంబోలో వస్తున్న బాలీవుడ్ తాజా మూవీ థామా..ఈ సినిమా అక్టోబర్ 21న విడుదలకు సిద్ధంగా ఉండడంతో రీసెంట్ గా మడాక్ ఫిలిమ్స్ ఈ సినిమా ట్రైలర్ని రిలీజ్ చేసింది. అయితే ఈ ట్రైలర్లో రష్మిక కంటే ఎక్కువ హైలైట్ అయింది మరో నటి. ఆమె ఎవరో కాదు నోరా ఫతేహి.. థామా ట్రైలర్లో నోరా ఫతేహి గెస్ట్ రోల్ చేస్తున్నట్టు ట్రైలర్ చూసిన చాలామంది నెటిజన్స్ భావించారు. కానీ సడన్గా ఈ సినిమాలో గెస్ట్ రోల్ కాదు ఏకంగా ఓ స్పెషల్ సాంగ్ చేస్తున్నట్టు అఫీషియల్గా బయట పడింది. తాజాగా నోరా ఫతేహి థామా మూవీలో 'దిల్బార్ కి ఆంఖోన్ కా" అనే స్పెషల్ సాంగ్ చేస్తున్నట్టు ప్రకటించింది. అంతేకాదు ఈరోజు మధ్యాహ్నం థామ మూవీ నుండి నోరా ఫతేహి చేస్తున్న పాట కూడా రిలీజ్ అయింది. అయితే నోరా ఫతేహి చేసిన దిల్బార్కి ఆంఖోన్ కా పాటని తాజాగా తన ఇన్స్టా ఖాతాలో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో చూసిన చాలా మంది నెటిజన్స్ నోరా ఫతేహి అందాలకు నోరెళ్ళ బెడుతున్నారు. అంతేకాదు థామా సినిమాలో రష్మిక మందన్నా కంటే నోరా ఫతేహి తన అందంతో మెస్మరైజ్ చేస్తుందని, ఖచ్చితంగా రష్మికని పక్కకు నెట్టి నోరా ఫతేహి క్రేజ్ సంపాదిస్తుంది అంటూ కామెంట్స్ పెడుతున్నారు ఆమె అందానికి మంత్ర ముగ్ధులైనటువంటి నెటిజన్స్. మరి చూడాలి ఈ సినిమాలో స్పెషల్ సాంగ్లో చేసిన నోరా ఫతేహి మెయిన్ హీరోయిన్గా చేసిన రష్మిక కంటే ఎక్కువ గుర్తింపు తెచ్చుకుంటుందా అనేది.. నోరా ఫతేహి థామా మూవీలో దిల్బార్కి ఆంఖోన్ కా పాట గురించి మాట్లాడుతూ.. "బాలీవుడ్లో గత కొద్ది రోజులుగా నా నుండి స్పెషల్ సాంగ్స్ రావడం లేదు.నేను చేసిన స్త్రీ -1మూవీలో కమారియా పాట నా జీవితాన్ని మార్చేసింది. అలాగే కమారియా, దిల్బర్ రెండు పాటలు కూడా ఒకేసారి షూటింగ్ జరుపుకున్నాయి. ఈ రెండు ఒకే నెలలో విడుదలయ్యాయి. అలా ఈ రెండు పాటల ద్వారా నేను బీటౌన్లో ఫేమస్ అయ్యాను. తాజాగా నేను చేసిన థామా సినిమాలోని దిల్బార్ కి ఆంఖోన్ కా అనే పాట కూడా నాకు మరింత గుర్తింపుని తెస్తుంది.చాలా రోజుల నుండి నా అభిమానులు ఇలాంటి స్పెషల్ సాంగ్స్లో నన్ను మిస్ అయ్యారు. కానీ థామాలోని స్పెషల్ సాంగ్తో మళ్లీ ఆ వైబ్ని తీసుకు రాబోతున్నాను. ఇందులో మంచి హుక్ స్టెప్ ఉంది. మీరందరూ ఇష్టపడే నోరా ఫతేహి మళ్ళీ తిరిగి రాబోతుంది" అంటూ థామా సినిమాలోని స్పెషల్ సాంగ్ గురించి మాట్లాడింది.అలా తాజాగా విడుదలైన ఈ సాంగ్తో నిజంగానే మునపటి నోరా ఫతేహిని చూస్తున్నామని ఆమె ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు. థామా సినిమా విషయానికి వస్తే.. ఆదిత్య సర్పోత్దార్ డైరెక్షన్లో తెరకెక్కుతున్న రొమాంటిక్ కామెడీ హార్రర్ మూవీ థామా.. మాడాక్ హార్రర్ కామెడీ యూనివర్స్లో ఐదో భాగంగా ఈ సినిమా రాబోతోంది. ఇందులో ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నాలు ప్రధాన పాత్రలో నటించగా.. నవాజుద్దీన్ సిద్ధికీ, రామ్ బజాజ్ గోయల్, పరేష్ రావల్,ఫైసల్ మాలిక్, సంజయ్ దత్, గీత అగర్వాల్ కీ రోల్స్ పోషించారు.


# 'మిత్రమండలి' ట్రైలర్.. కావాల్సినంత ఫన్ పక్కా!



టాలీవుడ్ నటుడు ప్రియదర్శి లీడ్ రోల్లో ఇప్పుడు లేటెస్ట్ మూవీ మిత్రమండలి చేస్తున్న విషయం తెలిసిందే. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ నిహారిక ఎన్ ఎం హీరోయిన్గా నటిస్తున్న ఆ సినిమాలో మ్యాడ్ ఫేమ్ నటీనటులు విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విజయేందర్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను బీవీ వర్క్స్, సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి కాగా.. దీపావళి కానుకగా అక్టోబర్ 16న సినిమాను రిలీజ్ చేయనున్నారు. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మేకర్స్.. వరుస అప్డేట్స్ ను రిలీజ్ చేస్తూ ఆసక్తిని పెంచుతున్నారు. ఇప్పటివరకు సినిమా నుంచి విడుదల చేసిన అప్డేట్స్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ఆడియన్స్లో అంచనాలు పెంచాయి. ఫన్, మిస్టరీ జానర్లో మూవీని రూపొందించినట్లు క్లియర్గా చెప్పేశాయి. అయితే రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో మేకర్స్ మరింత స్పీడ్ పెంచారు. మిత్రమండలి ట్రైలర్ను తాజాగా విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్గా మారిన ట్రైలర్.. ఆకట్టుకుంటోంది. సినీ ప్రియులను కడుపుబ్బా నవ్విస్తోంది. ప్రస్తుతం ట్రెండ్ కు అనుగుణంగా సరదా డైలాగులతో మెప్పిస్తోంది. ఒకే అమ్మాయి కోసం స్నేహితులంతా గొడవ పడడంతో ఇలాంటి మహిళా మండలి కోసమే మిత్రమండలి కనుమరుగవుతోందటూ చెప్పిన కొన్ని డైలాగ్స్ ఫుల్ ఫన్నీగా ఉన్నాయి. ముఖ్యంగా ట్రైలర్లో రాగ్ మయూర్, ప్రసాద్, విష్ణుతో వెన్నెల కిషోర్ చేసిన కామెడీ మెయిన్ హైలెట్గా నిలిచేలా ఉంది. సత్య, నిహారిక, వెన్నెల కిషోర్ తమ కామెడీ టైమింగ్తో ప్రేక్షకులను నవ్విస్తున్నారు. హాస్య బ్రహ్మ బ్రహ్మానందం సన్నివేశం కూడా అందరినీ ఎంతగానో ఆకట్టుకుంటోంది.


సినిమా ప్రేక్షకులకు కావాల్సినంత ఫన్ ఇస్తుందని ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. కాగా మూవీ విషయానికొస్తే.. బన్నీ వాస్ సమర్పిస్తున్న మిత్రమండలి చిత్రాన్ని కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బన్నీ వాస్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మరి ఆయన ప్రొడక్షన్ బ్యానర్పై తొలి మూవీగా వస్తున్న మిత్రమండలి ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# ఆ స్టార్ హీరో సరసన సమంత?



నేషనల్ అవార్డ్ విన్నర్ వెట్రిమారన్ దర్శకత్వంలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు ఓ సినిమా చేయనున్నారని గత కొంత కాలంగా వార్తలొస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడా వార్తలను నిజం చేస్తూ మేకర్స్ సినిమాను అనౌన్స్ చేస్తూ టైటిల్ ను రివీల్ చేశారు. వెట్రిమారన్- శింబు కలయికలో వస్తున్న ఈ సినిమాకు ఆరసన్ అనే టైటిల్ను ఫిక్స్ చేశారు దర్శక నిర్మాతలు. శింబు 49గా ఆరసన్ శింబు కెరీర్లో 49వ చిత్రంగా వస్తోన్న ఈ మూవీని ప్రముఖ నిర్మాత కళైపులి థాను నిర్మిస్తుండగా, సౌత్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాలో శింబు సరసన హీరోయిన్గా సౌత్ స్టార్ హీరోయిన్ సమంతను తీసుకోవాలని మేకర్స్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగా మేకర్స్ సమంతతో చర్చలు ప్రారంభించారని టాక్ వినిపిస్తోంది. అయితే ఆ డిస్కషన్స్ ఇంకా ప్రారంభ దశలో ఉన్నాయని, ఒకవేళ అన్నీ కుదిరి, సినిమా కార్యరూపం దాల్చితే శింబు, సమంత కలిసి చేయబోయే మొదటి సినిమా ఇదే అవుతుంది. ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మయోసైటిస్ వ్యాధి వల్ల కొంతకాలం పాటూ సినిమాలకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు తిరిగి సినిమాలను చేస్తున్నారు. వడ చెన్నై యూనివర్స్ లో భాగంగా ఆరసన్ అయితే గతంలో లాగా ఎక్కువ సినిమాలు చేయడం లేదు సమంత. సినిమాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్న సమంత మళ్లీ చాలా కాలం తర్వాత తమిళంలో సినిమా చేయబోతుందన్న వార్త విని ఆమె అభిమానులు సంతోషిస్తున్నారు. కాగా ఆరసన్ మూవీని వెట్రిమారన్ వడ చెన్నై యూనివర్స్లో భాగంగా రూపొందించనున్నట్టు ఇప్పటికే వెల్లడించారు. ఈ యూనివర్స్లో మరిన్ని సినిమాలు రానున్నాయని సమాచారం. వెట్రిమారన్, శింబు ఇద్దరూ మంచి టాలెంటెడ్ పర్సన్స్ కావడంతో వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమాపై మంచి అంచనాలున్నాయి.

# మాస్ జాతర.. ఎపిక్ ఫైట్ తప్పేలా లేదు..!







మాస్ మహరాజ్ రవితేజ మాస్ జాతర సినిమా అక్టోబర్ 31న రిలీజ్ లాక్ చేశారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమాను భాను భోగవరపు డైరెక్ట్ చేశాడు. శ్రీవిష్ణు సామజవరగమన సినిమాకు రైటర్గా పనిచేసిన భాను రవితేజ ఎనర్జీకి మ్యాచ్ అయ్యే కథ చెప్పడంతో వెంటనే ఈ సినిమా ఓకే చేశారు. అసలైతే ఈ సినిమా లాస్ట్ ఇయర్ రిలీజ్ అవ్వాల్సింది కానీ సంక్రాంతికి రిలీజ్ అనుకున్నారు. కానీ అలా అనుకోని కారణాల వల్ల వాయిదాలు పడుతూ వచ్చింది. ఫైనల్గా అక్టోబర్ 31న మాస్ జాతర రిలీజ్ కన్ ఫర్మ్ చేశారు. ఐతే ఈ సినిమా రిలీజ్ టైంకు కొత్త సినిమాల తాకిడి లేదని అనుకోగా రీ రిలీజ్ సినిమాతో హెడేక్ వచ్చి పడేలా ఉంది. అదేంటి ఇక్కడ రవితేజ సినిమా ఉంటే రీ రిలీజ్ సినిమా ఎందుకు బజ్ అందుకుంటుంది అంటే. అక్కడ రీ రిలీజ్ అవుతున్న సినిమా బాహుబలి ది ఎపిక్ కాబట్టి ఆలోచించాల్సిందే. ఎందుకంటే అసలే రాజమౌళి అదేదో కొత్త సినిమా రిలీజ్ అన్నట్టుగా తన డ్యూటీ చేస్తున్నాడు. రీ రిలీజ్లో రెబల్ ఫ్యాన్స్ మాత్రమే కాదు బాహుబలి ఫ్యాన్స్ కూడా షాక్ అయ్యే సీన్స్ కొన్ని ఉంటాయని అంటున్నారు. రాజమౌళి బాహుబలి ఎపిక్ రిలీజ్ కోసం ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా ప్లాన్ చేస్తున్నాడట. సో కచ్చితంగా బాహుబలి ఎపిక్తో రవితేజ మాస్ జాతర గట్టి పోటీ ఎదుకునే పరిస్థితి కనబడుతుంది. ఐతే మాస్ రాజా ఫ్యాన్స్ మాత్రం మాస్ జాతర మీద చాలా హోప్స్ పెట్టుకున్నారు. సినిమాతో రవితేజ ఎలాగైనా హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తున్నాడు. ధమాకా తర్వాత రవితేజ.. ధమాకా తర్వాత రవితేజ చేస్తున్న సినిమాలన్నీ కూడా వర్క్ అవుట్ కాలేదు. మళ్లీ ధమాకా జంట కలిసి చేసిన సినిమా మాస్ జాతర. ఈ సినిమాలో రవితేజ ఎనర్జీ ఫ్యాన్స్కి ఫీస్ట్ అందిస్తుందని అంటున్నారు. ఇప్పటికే సినిమా ప్రమోషన్స్ కూడా మొదలు పెట్టారు కాబట్టి రవితేజ మాస్ జాతత ఫ్యాన్స్ కి జోష్ తెప్పించడం పక్కా అనేలా ఉంది. మరి బాహుబలి ఎపిక్ ఎఫెక్ట్ రవితేజ సినిమా మీద ఎంత పడుతుంది అన్నది రిలీజ్ దగ్గర పడుతున్న టైంలో అర్ధమవుతుంది. రవితేజ మాత్రం మాస్ జాతర మీద చాలా కాన్ఫిడెంట్గా ఉన్నాడని తెలుస్తుంది. సినిమా కథ కథనంతో పాటు రవితేజ ఫ్యాన్స్ ఏదైతే ఆశిస్తారో ఆ ఎంటర్టైన్మెంట్ కూడా మాస్ జాతరలో ఉందని చిత్ర యూనిట్ చెబుతున్నారు. సో అవతల బాహుబలి ది ఎపిక్ అయినా కూడా ఇక్కడ ఉంది మాస్ మహారాజ్ రవితేజ కాబట్టి తన మాస్ మేనియా చూపిస్తాడని అంటున్నారు.

# జీవితం అంటే సంపూర్ణమైన ఆరోగ్యం : హోంమంత్రి వంగలపూడి అనిత

## - అవగాహన ద్వారానే స్వచ్ఛాంధ్ర సాధ్యం : ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి - స్వచ్ఛాంధ్ర - 2025 అవార్డుల పంపిణీ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జీవితం అంటే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, హోం శాఖామంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. చిన్నతనం నుంచే పిల్లలకు పరిసరాల పరిశుభ్రతను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం జరిగిన స్వచ్ఛాంధ్ర-2025 జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మొత్తం48 మంది వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండటంలో పారిశుధ్య కార్మికులు పాత్ర చాలా కీలకమని అన్నారు. పారిశుధ్య కార్మికులు వారి ఆరోగ్యాన్ని పక్కనపెట్టి, సేవలందిస్తున్నారని అన్నారు. పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అవార్డులను ప్రవేశపెట్టారని చెప్పారు. రాష్ట్రంలో పేరుకుపోయిన సుమారు 89 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించి, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు కృషి చేశారని చెప్పారు. ప్రభుత్వం స్వఛ్ఛాంధ్ర పేరుతో అనేక కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో చెత్తనుండి కూడా సంపద సృష్టి జరుగుతోందని చెప్పారు. చెత్త రహిత పరిసరాల పరిశుభ్రతకోసం రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశే ఎన్డియే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పరిశరాల పరిశుభ్రత ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. ఖచ్చితమైన లక్ష్యంతో ముందడుగు వేయాలని, అంకితభావంతో కృషి చేయాలని కోరారు. ప్రతీనెలా మూడవ శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల్లో అవగాహన పెంచడం వల్లే స్వచ్ఛభారత్ సాధించవచ్చునని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన పరిసరాలు ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమని అన్నారు. ప్రతీఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కలిసికట్టుగా కృషి చేయడం వల్లే స్వచ్ఛత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. స్వచ్ఛత సాధనలో ప్రతీఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. స్వచ్ఛాంధ్ర సాధనకు చేస్తున్న కృషిని, కార్యాచరణ ప్రణాళికను వివరించారు. 15 విభాగాల్లో 48 మంది అవార్డులు గెలుచుకున్నారని చెప్పారు. అదేవిధంగా రెండు రాష్ట్రస్థాయి అవార్డులు కూడా జిల్లాకు లభించాయని తెలిపారు. మార్కెఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎంఎల్‌సి కావలి గ్రీష్మ మాట్లాడారు. కార్యక్రమంలో రాజాం, నెల్లిమర్ల మున్సిపల్ ఛైర్మన్లు, విజయనగరం మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భక్తుల రాకపోకలకు, దర్శనానికి ప్రాధాన్యత : జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి








**విజయనగరం, (రాజధాని వార్తలు):** శ్రీ పైడితల్లి అమ్మవారు సిరిమాను పండగ సందర్భంగా సోమవారం జరుగుతున్న తోలేల్లు ఉత్సవాలు మరియు మంగళవారం సిరిమాను ఉత్సవం ప్రజలందరూ దర్శనం చేసుకోవడానికి, సులభంగా వెళ్లి రావటానికి వీలుగా బార్కేడింగ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం ఎస్పి ఏఆర్ దామోదర్‌తో కలిసి కోట వద్ద నుండి అమ్మవారి గుడి వెనుక భాగాలలో, అంబటి సత్రం కూడలి వరకు పరిశీలించారు. ఏర్పాటు చేస్తున్న బారికేడ్ల ఎత్తును, వాటి పటిష్టతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10:30కు సిరిమాను రథం హుకుంపేటలో బయలుదేరి అమ్మవారి గుడి చేరుకోవాలని, అక్కడ రథం ఏర్పాట్లను పూర్తి చేసి మూడు గంటలకు సిరిమాను ప్రారంభించాలని సూచించారు. ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ సామాన్య భక్తులందరికీ సులభ దర్శనం కలిగే విధంగా 2,600 మందితో ఏర్పాటు చేశామని, ప్రజలకు సుఖ దర్శనం కలిగే విధంగా అన్ని చర్యలు తీసుకున్నామని, పక్కన ఉన్న పాడుపడిన భవనాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎటువంటి అవరోధాలు లేకుండా సిరిమాను సాఫీగా తిరిగే విధంగా అన్ని చర్యలు తీసుకున్నమని వివరించారు. ఈ పర్యటనలో ఏఎస్పీలు, సౌమ్యలత, షహబాజ్ అహ్మద్, దేవదాయ శాఖ ఏ.సీ శిరీష, ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

## - అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని పురిటిపెంట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బంగారమ్మ తల్లి గుడి వద్ద బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ పాల్గొని బంగారమ్మ తల్లిని దర్శించుకున్నారు అలాగే మాజీ జడ్పిటిసి మక్కువ శ్రీధర్, గజపతినగరం, పురిటిపెంట గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బంగారమ్మ తల్లిని దర్శనం చేసుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# పైడిమాంబను దర్శించుకున్న మాన్సాస్ ఛైర్మన్, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు - అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ








**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గజపతుల ఆడపడుచు శ్రీపైడితల్లి అమ్మవారిని, మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ గౌరవ పూసపాటి అశోక్ గజపతిరాజు సోమవారం దర్శించుకున్నారు. సంప్రదాయానుసారం అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా కోట నుంచి బయలుదేరి, మేళ తాళాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయాన్ని చేరుకొని పట్టు వస్త్రాలను సమర్పించారు. పైడిమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు అధికార లాంచనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం అశోక్ గజపతిరాజు దంపతులకు ఆలయ పూజారులు ఆశీర్వచనం పలికి, అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో అశోక్ గజపతిరాజు కుమార్తె, విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర ప్రముఖులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఏడాదిలోగా ఆలయ అభివృద్ధి పనులు**

ఏడాదిలోగా పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని అశోక్ గజపతిరాజు అన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే అభివృద్ధి పనులను మొదలు పెట్టామని, వచ్చే ఏడాది అమ్మవారి పండగ లోపల అవన్నీ పూర్తవుతాయని చెప్పారు. పైడితల్లి అమ్మవారు ప్రజలందరిని చల్లగా చూడాలని ఆయన ఆకాంక్షించారు.

# పశువుల అక్రమ రవాణా...మరోసారి పట్టుపడ్డ పశువులు...చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై



**బూర్గంపాడు, (రాజధాని వార్తలు):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని జింకలగూడెం గ్రామంలో బుర్గంపహడ్ పోలీసులకు మరో సారి పట్టుబడ్డ పశువులు. ఈ జింకలగూడెం గ్రామంలో పలు మార్లు పశువుల అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన విషయం విధితమే. సోమవారం తెల్లవారు జాము సుమారు 3:30 నిమిషాలకు లారీలో 32 పశువులను (25 ఎద్దులు, 7 ఆవులు) అక్రమంగా హైదరాబాద్ కబేళాలకు తరలిస్తుండగా వాటిని పట్టు కొన్నారు. ఎస్ఐ మేడ ప్రసాద్ ఆదేశానుసారం పాల్వంచ గోశాలకు తరలించిన అదనపు ఎస్ ఐ నాగబిక్షం. ఎస్.కె ఇస్మాయిల్ R/o జింకలగూడెం అను అతను హైదరాబాద్‌కు చెందిన ఖైజర్ అను వ్యక్తికి తరలిస్తుండగా పట్టుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయడం జరుగుతుందని ఓ ప్రకటనలో తెలిపారు. నిందితుల వివరాలు: 1. ఎస్.కె.ఇస్మాయిల్, 2. జాకీర్, లారీ డ్రైవర్ R/o హైదరాబాద్, పరారీ ఉన్న నిందితుడు, 3. ఖైజర్, లారీ ఓనర్ మరియు రిసీవర్ R/o హైదరాబాద్‌గా తెలిపారు.

# తర్లువాడ దళిత రైతుల భూ పోరాటానికి సిపిఎం మద్దతు




**ఆనందపురం, (రాజధాని వార్తలు):** ఆనందపురం మండలం తర్లువాడ గ్రామపంచాయతీ పరిధిలో ఎస్సీ కాలనీకి చెందిన 49 మంది రైతులు దగ్గర సర్వే నంబర్లు 1, 71, 72, 74, 75, 35 ల్యాండ్ పూలింగ్ పేరుతో గూగుల్ టెక్ కంపెనీకి దళితుల భూమి ఇవ్వడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని రైతులు ఆందోళన చేశారు ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఎస్సీ కాలనీ రైతులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాలు చొప్పున భూములు కేటాయించడం జరిగింది అని అప్పటినుండి రైతులు జీడిమామిడి సపోటా నిమ్మ చెట్లు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు! ఇప్పుడు రైతుల భూములు ఎలాంటి అనుమతులు లేకుండా బలవంతంగా లాక్కొని గూగుల్ టేక్ కంపెనీకి ఇవ్వడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని రైతులు ఆరోపించారు ఈ పోరాటానికి మద్దతుగా సిపిఎం అండగా ఉంటుందని సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు అనుమతి లేనిదే భూములు తీసుకోవడం చెల్లదని 60 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నా భూములకు రైతులే హక్కుదారులని వాళ్ల దగ్గర నుంచి భూములు తీసుకోవడం ఎవరికి సాధ్యం కాదని రైతులు అనుమతులు లేనిదే పూలింగు పేరుతో బలవంతంగా భూములు తీసుకోవడం చెల్లదని హైకోర్టు స్పష్టంగా చెప్పిందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని సిపిఎం పార్టీ దళిత రైతులకు అండగా ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ భీమిలి జోన్ సహాయ కార్యదర్శి ఎస్ అప్పలనాయుడు 49 మంది బాధ్యత రైతులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితునికి గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.15 వేలు ఆర్థిక సాయం




**అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం, (రాజధాని వార్తలు):** అమలాపురం రూరల్ మండలం బండారు లంక గ్రామానికి చెందిన సరెళ్ల వెంకట ఆనంద్‌కు రెండు కిడ్నీలు పాడై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు కిడ్నీ బాధితుడు వెంకట ఆనంద్ వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. సోమవారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావు రూ.15 వేలు చెక్‌ను బాధితుడు వెంకట ఆనంద్‌కు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావుకు వెంకట ఆనంద్ అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ వైసిపి నాయకులు పందిరి సుబ్బరాజు, శ్రీను, నేరేడుమిల్లి శ్రీను, నేలపూడి సుగంధ కుమార్, దంగేటి సుబ్బు, గంటా లక్ష్మీ ప్రసాద్, విప్పర్తి రమేష్, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# యర్ర వారి హాఫ్ శారీ కార్యక్రమంలో సిరమ్మ



**భీమిలి, (రాజధాని వార్తలు):** భీమిలి నియోజకవర్గం, సింహాచలం, అడవివరం గ్రామం, కాపు విధికి చెందిన యర్ర నరేష్, గౌరీ దంపతుల కుమార్తె చి.వి.సుష్మిత ఆఫ్ సారీ కార్యక్రమానికి ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్. ఆర్.సి.పి.జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర (సిరమ్మ) ఆదివారం పాల్గొని చి.వి. సుష్మితను ఆశీర్వదించారు చీర, పసుపు కుంకుమలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జీఎస్టీ 2.0తో దేశంలో ఆర్థిక పెనుమార్పుకి శ్రీకారం

**గాజువాక, విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జీఎస్టీ 2.0 ను ప్రకటించడం చారిత్రాత్మక పరిణామమని, ఇది దేశంలో ఆర్థిక పెనుమార్పుకు, ప్రజలలో జీవన నాణ్యత పెరుగుదలకు దోహదపడుతోందని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గాజువాకలో ఘనంగా నిర్వహించిన ర్యాలీలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జీఎస్టీ 2.0 దేశంలో ప్రతి ఇంటికి ఆర్థిక సౌలభ్యాలను తీసుకువస్తూ, దసరా, దీపావళి పండుగలతో సమకాలీనంగా ప్రజలకు నిజమైన ఆర్థిక పండుగగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు స్థిర, సంకల్ప పాలన మరియు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో, డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రజలకు డబుల్ బెనిఫిట్స్ అందిస్తోంది అని కొనియాడారు. కొత్త జీఎస్టీ సంస్కరణల వల్ల వాహనాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కార్లు, బైకులు ధరలు తగ్గుముఖం పడడంతో సేల్స్ గణనీయంగా పెరిగాయి. మోదీ కేంద్ర పాలనలో దేశం ఆర్థిక, సైనిక శక్తిగా ఎదుగుతున్న సమయంలో, స్వదేశీ వస్తువులను ప్రాధాన్యం ఇవ్వడం అత్యంత అవసరం అని అన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలు, రైతులు, విద్యార్థులు నేరుగా లబ్ధి పొందుతారని తెలిపారు. నిత్యావసర వస్తువులు, వైద్యం, విద్య, వ్యవసాయ పరికరాలపై రేట్లు తగ్గించడం, ప్రాణాధార ఔషధాలపై పన్ను రద్దు, ఇతర మందులపై 5% రేటు విధించడం, విద్యపై జీఎస్టీ పూర్తిగా రద్దు వలన ప్రజల భవిష్యత్తుకు భరోసా అందిస్తోందని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రం కలసి పనిచేస్తున్నామని. ?14,000 కోట్ల రివైవల్ ప్యాకేజీ సాధించడం, అందులో ఇప్పటికే ?9,500 కోట్లు జమ కావడం, ఉత్పత్తి పెరగడం వలన స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు బలమైన పునాది వేసింది. ఇది రాష్ట్ర ఆర్థికతకు, ఉద్యోగ అవకాశాలకు, పరిశ్రమ అభివృద్ధికి కీలకంగా మారిందిశ్రీనివాసరావు అని పల్లా శ్రీనివాసరావు చెప్పారు. విశాఖపట్నం నగరాన్ని అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఐటీ మంత్రి నారా లోకేష్ కృషితో విశాఖ తూర్పు తీరంలో అతిపెద్ద ఐటీ హబ్‌గా మారబోతోంది. టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి దిగ్గజ కంపెనీలు రాష్ట్రానికి వచ్చి, ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ మ్యాప్‌లో నిలబెట్టాయి అని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల జీఎస్టీ 2.0, విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ, ఐటీ హబ్ ఈ విధంగా ప్రజలకు డబుల్ బెనిఫిట్స్ అందిస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌కి రాష్ట్ర ప్రజలు తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. గాజువాక ఏఎస్‌ఓ ఆఫీస్ వద్ద నుంచి లిజీఎస్టీ అవగాహన సదస్సు భారీ ర్యాలీలో పాల్గొన్న కూటమి పార్టీ కుటుంబ సభ్యులు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు జనసేన ఇన్చార్జ్ డిసిసిబి చైర్మన్ కోన తాతారావు బిజెపి గాజువాక నియోజకవర్గం ఇంచార్జ్ కెఎన్ఆర్, ఎంఆర్ఓ, ఏఎస్ఓ, APIIC డైరెక్టర్ మరియు గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాజీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు చిరంజీవి, కార్పొరేటర్ బోండా జగన్, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, కార్పొరేటర్ కేబుల్ మూర్తి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు అంగ కృష్ణ, సోర్ణపూడి రామాబాయ్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు తమ్మిరే శివప్రసాద్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి డి,వి, సత్యారావు, నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షులు గణపతి యువత ప్రధాన కార్యదర్శి నరేష్ మహిళ అధ్యక్షురాలు గొలగాని భవాని ప్రధాన కార్యదర్శి సన్యాసమ్మ వార్డ్ అధ్యక్షలు గోమాడ వాసు రట్టి వాసు లక్ష్మణరావు వార్డ్ సెక్రటరీలు గాజువాక నియోజవర్గం కూటమి పార్టీ కుటుంబ సభ్యులు అందరు పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలియపరుస్తున్నాము.

# ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న జెడ్పీ చైర్ పర్సన్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మ వారిని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైసీపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అయన సతీమణి మజ్జి పుష్పాంజలి, అల్లుడు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ కుటుంబ సభ్యులు మరియు బంధు మిత్రులు పాల్గొని పైడితల్లి అమ్మవారిని దర్శించి అమ్మ వారికి పట్టువస్త్రంలను సమర్పించారు. ముందుగా ఆలయ పండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద పండితులచే ప్రత్యేక పూజలు జరిపి, వారి అశ్వీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఇలవేల్పు, విజయనగరం జిల్లా ప్రజల ఆరాధ్య దేవత శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారి ఆశీస్సులు జిల్లా ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని మనసారా కోరుకుంటున్నా అని తెలియజేశారు.

# మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్




**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** సోమవారం సాయంత్రం బోడ గుట్టకు చెందిన ఖలీల్ పాషా బస్టాండ్ ప్రాంతంలోని ఆర్టీసీ బంక్ వద్ద జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్ తక్షణమే స్పందించి ఖలీల్ పాషాను తన వాహనంలో ఆస్పత్రికి తీసుకుని వెళ్లి అక్కడ ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రమాదం గురించి సమాచారం అందించారు. మానవత్వంతో స్పందించి దగ్గరుండి ఆసుపత్రికి తరలించిన ఎస్సై ప్రవీణ్ కుమార్‌కు క్షతగాత్రుడు ఖలీల్ కుటుంబ సభ్యులతో పాటుగా ఘటన స్థలంలో ఉన్న ప్రజలు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు.

# స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం స్థానిక రెడ్డి సత్రం నందు స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకంగా జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య మరియు భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు జడ్పిటిసి, ఎంపీటీసీ, వార్డు మెంబర్లకు సంబంధించిన దరఖాస్తులను టిపిసిసి సభ్యులు బుడగం శ్రీనివాస్ నేతృత్వంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బలుసు నాగ సతీష్, ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు సరెళ్ళ వెంకటేష్, మగపు రాజు, కొత్త శ్రీనివాస్, నిట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ లంబాడా సమస్యపై సుదీర్ఘ ధర్మ యుద్ధానికి సిద్ధమైన ఆదివాసులు





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** చట్టబద్ధతలేని లంబాడా మరియు ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడంపై ఆదివాసి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని ఈ విషయంపై దీర్ఘకాలిక ఉద్యమానికి అన్ని ఆదివాసి ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థి మహిళ సంఘాలు సంఘటితమై దీర్ఘకాలిక సమరశీల పోరాటాల సిద్ధమవుతున్నట్లు ఆదివాసి సంఘాల జాయింట్ ఆక్షన్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పునేమ్ శ్రీనివాస్ తెలిపారు. భద్రాచలంలో జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో పలువురు వక్తలు చట్టబద్ధతలేని లంబాడాలు మరియు మైదాన ప్రాంత తెగులు అక్రమ పద్ధతుల్లో ఎస్టీ జాబితాలో చేర్చడం పట్ల ఇది చారిత్రిక తప్పిదమని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఈ చర్య నాడు జరిగిందని ఈ సంఘటనను తిరిగి సరి చేయాల్సిన బాధ్యత నేటి పాలకవర్గాల పై ఉందని సభా వేదిక తరపున పరువు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇండో ఆర్యన్ మైదాన ప్రతి గిరిజనులు వివిధ రాష్ట్రాల్లో వివిధ రకాలుగా అనగా చౌహన్, రాజపుటు, బంజారా సుగాలి కైతలంబాడి ఉన్న వీరు ఆదివాసి సమాజంలో హక్కులు రిజర్వేషన్లు ఉద్యోగ ఉపాధి సహజ వనరులు భూమి తదితర గత 50 సంవత్సరాలుగా అక్రమ పద్ధతిలో అనుభవిస్తున్నారని వెంటనే వారిని ఎస్టీ జాబితాలో తొలగించుటకు తెలంగాణ వ్యాప్తంగా విస్తృతమైనటువంటి ఆదివాసి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. నేటి నుంచి ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని నీతిగా నిజాయితీగా నిబద్ధతతో శాంతియుతంగా ఉద్యమ ప్రణాళిక చేపడతామని జాబ్ చైర్మన్ పుణ్యం శ్రీనివాస్ తెలిపారు. భద్రాచలంలోని ఆదివాసి అభిదేవంలో జరిగిన ఈ సమావేశంలో పలు సమరాల నాయకులు పాల్గొని వారికి అభిప్రాయాన్ని ప్రజాస్వామ్యయుతంగా తెలియపరిచారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ సలహాదారులుగా కొరసా వెంకటేశ్వర్లు, సోందే వీరయ్య, చందా లింగయ్య దొర, రమణాల లక్ష్మయ్య, చిట్టిబాబు, గుండు శరత్, కల్లూరి జయ బాబు ఎన్నికవ్వగా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ గా పునేం శ్రీనివాస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వట్టం ఉపేందర్ వైస్ చైర్మన్‌లుగా కోవా దౌలత రావుముఖాసి, పాయం సత్యనారాయణ, ముర్ల రమేష్, వాసం రామకృష్ణ దొర, నరసింహమూర్తి ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముర్రం వీరభద్రం, మడి సాయిబాబు (కోశాధికారి), నాగరాజు, సమ్మయ్య, సర్వేషు, మహిళా ప్రతినిధులుగా కుంజా రమాదేవి, కణితి రాధా జాయింట్ యాక్షన్ కమిటీ అధికార ప్రతినిధులుగా ఉకే రవి, సోయం కన్నరాజు స్టీరింగ్ కమిటీ సభ్యులుగా కురసా నరేష్, రాయ్ సిడం జంగ్ పటేల్, జగ్గా పుల్లయ్య, పాయం రవి వర్మ, పునేం కృష్ణ, పూనం వీరభద్రం, కొమరం కుమార్, సోడే వెంకట్, కడప వామన్ రావు, రామారావు, చందా నరసింహారావు, కనక యాదవరావు, విద్యార్థి మహిళ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ లు అనుబంధంగా పనిచేస్తాయని వారందరితో ఈ యొక్క డిమాండ్ ని సాధిస్తామని ఈ సందర్భంగా వక్తులందరూ పేర్కొన్నారు. తొలత రాణి దుర్గావతి విగ్రహానికి పూలమాలలు వేసి నీవాలి అర్పించారు. కోయ, గోండు, కొండారెడ్డి, నాయక పోడు, చెంచు, మన్నువారు, అంధ, తోటి తెగల ప్రతినిధులు పాల్గొన్నారు. భవిష్యత్తు కార్యచరణ 2025 నవంబర్ 16న జరిగే చలో ఉట్నూర్ ద్వారా ఆదివాసి సమాజానికి తెలియపరుస్తామని పోనేం శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ద్వంద విధానాలతో గిరిజన కార్మికుల పొట్టగొట్టకండి

## - కలెక్టర్ గెజిట్ ప్రకారం పాత జీతమే చెల్లించాలి

## - హాస్టల్ డైలీ వేజ్ కార్మికుల మెరుపు ధర్నా



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** గత 20 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోకుండా హాస్టల్ డైలీ వెజ్ కార్మికుల జీతంతగ్గించి వేయటం పట్ల ఆగ్రహించిన కార్మికులు భద్రాచలం ఐటిడిఏ ముందు సోమవారం ఉదయం నుండి మెరుపు ధర్నాకు దిగారు ఏటూరునాగరం, ఉట్నూరు, ఐటిడిఎలతో సహా రాష్ట్రంమ్మొత్తం పాత పద్ధతిలో జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించి నప్పటికీ భద్రాచలం ఐటిడిఏ పరిదిలో మాత్రం జీతాలు తగ్గించి కలెక్టర్ గెజిట్‌ను విస్మరించి కార్మికులు పొట్టగొట్టారని డైలివేజ్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో ద్వంద విధానాలు అమలు చేస్తున్నారని దీనివ్ల జిల్లాలో ప్రతి కార్మికుడు నెలకు 16000/- వేల రూపాయలు నష్టపోయారని ఆదోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 25రోజులుగా సమ్మె చేస్తున్న వర్కర్లు జీతాలు తగ్గించి వేయటంతో ఆగ్రహించి సోమవారం ఉదయం నుండి ఐటిడిఏ కార్యలయం ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జేఏసీనాయకులు సిఐటియు జిల్లా అద్యక్షులు కె బ్రహ్మాచారి, బి నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఇతర జిల్లాల లాగానే భద్రాచలం ఐటిడిఏ పరిధిలో కార్మికుల కూడా పాత పద్ధతిలోనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకే డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు రెండు రకాల జీతాలు చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులకు నెలల తరబడి జీతాలు రాకపోయిన వచ్చే జీతం సగానికి సగంతగ్గించినా నకార్మికులు నూరు మూసుకుని పనిచేయాలనే అధికారులు, ప్రభుత్వం చెప్పటం అన్యాయమని అన్నారు. డైలివేజ్ వర్కర్లకు ఇతర ఐటిడిఏలలో వేసినట్లు ఇక్కడకూడా పాత జీతమే కలెక్టర్ గెజిట్ ప్రకారం చెల్లించకుంటే ధర్నా యధావిధంగా రాత్రి పూట కూడా కొనసాగుతుందని, ఔట్ సోర్సింగ్ వరక్కర్లకు 15600/- చెల్లించాలని డిండ్ చేశారు. జేఏసీ నాయకులతో డిడి (ఎఫ్ఏసి) అశోక్ చర్చించారు. తమ సమస్యలు పరిష్కారం చేస్తే తప్ప తాము పోరాటంఆపేది లేదని జేఏసీ నాయకులు తెగేసి చెప్పారు. దీంతో సమస్యని పి ఓతో చర్చిస్తామని చెప్పారు. ఉదయం ప్రారంభమైన ధర్నా సాయంత్రం 4.30 దాటిన కొనసాగుతూనే వుంది. కార్యక్రమంలో హీరాలాల్, కౌశల్యమంగీలాల్, ముత్తయ్య, జలందర్, స్వాప్ని, మంగ, నర్సింహారావు, స్వరూప, తిరుపతమ్మ, జీవా, సమ్మక్కతో పాటు ఉమ్మడి జిల్లా వర్కర్లు అందరు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు.

# గాజువాక కూంచుమాంబ కాలనీలో భారీ అన్న సమారాధన కార్యక్రమం













**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దేవీ నవరాత్రుల సందర్భంగా గాజువాక 71వ వార్డు కూంచుమాంబ కాలనీలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గమ్మ తల్లి ప్రసాదాన్ని స్వీకరించడానికి భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసి దుర్గమ్మ తల్లి ప్రసాదాన్ని స్వీకరించి దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూంచుమంబ కాలని (ప్రెసిడెంట్) పిన్నింటి మోహన్ (వైస్ ప్రెసిడెంట్) తాకాసి హరి, ప్రసాద్, వినోద్, సుబ్రహ్మణ్య, కనకరాజు, కాలనీ పెద్దలు, ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996


### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

## RAJADHANIVARTALU.COM
## 9440662699


# నూరు వసంతాలు పూర్తి చేసుకున్న ఆర్ఎస్ఎస్

## - వందేళ్ళ చరిత్రలో దేశ సేవనే లక్ష్యంగా అచంచల త్యాగాలతో వెలిగిన శక్తి ఆర్ఎస్ఎస్ - రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతజయంతి





**రావులపాలెం, (రాజధాని వార్తలు):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతజయంతి పూర్తి చేసుకున్న సందర్భంగా విజయదశమి ఉత్సవంలో భాగంగా రావులపాలెం మండలం పరిధిలోని లక్ష్మీపోలవరంలో శ్రీదుర్గాదేవి కళ్యాణ మండపంనందు సంఘ్ ఈతకోట ఉపఖండ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ ప్రచారకులు ఆర్ ఎస్ ఎస్ వంద సంవత్సరాలు విజయదశమి ఉత్సవాలను నిర్వహించి ఆయుధ పూజ జరుపుకున్నారు.

100 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన దేశభక్తి సేవలో మేము కూడా భాగస్వామ్యం అయి నందుకు గర్వపడుతున్నానని స్వయం సేవకులు ఆనందం వ్యక్తం చేస్తు సంఘ్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు అభివాదం చేసుకు న్నారు. 1925 నుండి దేశ సేవలో అభివృద్ధి, దేశం నాగరికత, సంప్రదా యాలను కాపాడుకోవడంలో గత వందేళ్ల నుండి విశేష కృషి చేస్తు ఎంతో మంది ఉత్తములను నిస్వా ర్ధపరులను ఈ దేశ సేవకులుగా మలుస్తూ అందించిన ఘనత స్వయం సేవక్ సంఘ్‌దని అన్నారు. ఆర్ఎస్ఎస్ లేకుండా ఈ దేశాన్ని ఊహించుకోలేమన్నారు. వందేళ్ల చరిత్రలో దేశ సేవనే లక్ష్యంగా అచంచల త్యాగాలతో వెలిగిన శక్తి ఆర్ఎస్ఎస్ అని కొనియాడారు. దేశ సరిహద్దులో సైనికులు, దేశంలో పలు రాష్ట్రీయ స్వయం సంఘ్ సేవకులు ఈ దేశ రక్షణలో వీళ్ళే ప్రధానమన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్దపు చారిత్రక విజయదశమి ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు సేవకు లు మాట్లాడుతూ నిస్వార్ధ సేవ, క్రమశిక్షణ, దేశభక్తికి నిలువెత్తు నిదర్శనమైన ఆర్ ఎస్ ఎస్ సంస్థ అని అన్నారు. రాబోయే శతాబ్దంలో ఆర్ ఎస్ ఎస్ మరింత గొప్ప శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల సంజయ్, కలిదిండి ప్రసాద్ రాజు, ఇన్నా నరసింహమూర్తి, సతీష్ రెడ్డి, గంధ్రోతు వీరగోవిందరావు, రాజా, గుప్తా, కూనపరెడ్డి ఈశ్వరరావు, సంఘ్ ఉప ఖండ గ్రామాలకు చెందిన అనేకమంది స్వయం సేవకులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితునికి గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ.15 వేలు ఆర్థిక సాయం

**అమలాపురం, (రాజధాని వార్తలు):** రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తికి గుడ్ సీడ్ ఫౌండేషన్ రూ 15 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజే సింది. డాక్టర్ బి.ఆర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారు లంక గ్రామానికి చెందిన సరెళ్ల వెంకట ఆనంద్‌కు రెండు కిడ్నీలు పాడై ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నాడు. విషయం తెలుసుకున్న గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు కిడ్నీ బాధితుడు వెంకటఆనంద్ వైద్యానికి ఆర్థిక సాయం అందించారు. సోమవారం అమలాపురంలోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావు రూ. 15 వేలు చెక్‌ను బాధితుడు వెంకట ఆనంద్‌కు అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావుకు వెంకట ఆనంద్ అతని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో వైసిపి రాష్ట్ర ఎస్ సి సెల్ కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, వైసిపి నాయకులు పందిరి సుబ్బరాజు, శ్రీను, నేరేడుమిల్లి శ్రీను, నేలపూడి సుగంధ కుమార్, దంగేటి సుబ్బు, గంటా లక్ష్మీ ప్రసాద్, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


# లయన్స్ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** లయన్స్ ఇంటర్ నేషనల్ క్లబ్ సామర్లకోట శ్రీ భీమేశ్వర ఆధ్వర్యంలో మెగా వైద్య శిభిరాన్ని నిర్వహించారు. కైరా ఎమర్జన్సీ అండ్ ట్రామా సెంటర్ సౌజన్యంతో ఎముకలకు సంబంధించి ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని లయన్స్ మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, డాక్టర్ వెంకట్ భార్గవ్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రారంభించారు. సాయంత్రం వరకు జరిగిన శిబిరంలో వెన్ను నొప్పి, మోకాళ్ళ నొప్పి, బుజం నొప్పి, తుంటి నొప్పి, ఎముకలకు సంబంధించిన అన్ని పరీక్షలు, మహిళలకు సంబంధించిన గైనకాలిక్ పరీక్షలు, షుగర్, బిపి అలాగే సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ శిబిరంలో వందలాది మంది ప్రజలు పాల్గొనగా ప్రముఖ వైద్యులు డా.టి.వెంకట భార్గవ్, డా.కర్రి నిరూప, డా. సిహెచ్ అజయ్ డా.రాకేష్, డా. నంబూరు స్నేహ, డా.ఆశా రమ్య కైరా ఎమర్జన్సీ ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈదల ఈశ్వర్ కుమార్, క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు సీతారామరాజు, కోశాధికారి ఏలేటి రమేష్, నాయకులు బర్రె కృష్ణ మోహన్, చిత్తలూరి వీర్రాజు (రాజా), కర్రి ఆదినారాయణ రెడ్డి, గిడుతూరి శ్రీనివాసరావు, సేపేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరప ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రికి 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' అవార్డు




**కరప, (రాజధాని వార్తలు):** స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం కాకినాడ జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 52 అవార్డులను ప్రకటించింది. స్వచ్ఛ హాస్పిటల్స్ కేటగిరీలో కరప మండలం గురజనాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి 'స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర' పురస్కారాన్ని అందుకుంది. సోమవారం కాకినాడ గోదావరి కళాక్షేత్రంలో జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ బి. దివ్య జిల్లా కలెక్టర్ శన్మోహన్ సగిలి, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్య మాట్లాడుతూ స్వచ్ఛ హాస్పిటల్ విభాగంలో తమ ఆయుర్వేద వైద్యశాలకు గుర్తింపు రావడం సిబ్బంది, గ్రామస్థుల సమిష్టి కృషి ఫలితమన్నారు. ప్రభుత్వంచే ఇలాంటి అవార్డులు ప్రకటించడం ద్వారా సిబ్బందికి మరింత ప్రోత్సాహకరమన్నారు. ఆసుపత్రి ఆవరణలో ఔషధ మూలి కలను పెంపొందిస్తున్నామని, త్వరలో పంచకర్మ చికిత్సలు అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. తమ ఆసుపత్రి ద్వారా కరప, కాజులూరు మండల ప్రజలకు ఆయుష్ సేవలు అందిస్తున్నామని, విద్యార్థులకు ప్రతిరోజూ ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే ఏడాది రాష్ట్రస్థాయి 'స్వచ్ఛ హాస్పిటల్' గుర్తింపును సాధించడమే తమ లక్ష్యమని డాక్టర్ దివ్య వెల్లడించారు. కాకినాడ ఆయుష్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ షాజాద్ ఆలీ మాట్లాడుతూ ఆయుష్ విభాగానికి జిల్లాలో ఈ అవార్డు లభించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది ఎన్.ఎస్. కృష్ణమూర్తి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan